సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
సోమవారం, 03.08.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 272
పేజీలు: 08 వెల: రూ. 5

## ప్రపంచ దృష్టి భారత్ వైపే

భారత్‌లో బ్రిక్స్ సదస్సుకు షీ జిన్‌పింగ్, పుతిన్ రాక 02

- అమెరికాకు 'పీడకల' కాబోతుందా?
- చైనా-రష్యా-భారత్ భేటీ అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చ
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మూడో వంతు వాటా ఉన్న మూడు దేశాల నేతలు ఒకే వేదికపై
- బ్రిక్స్ సదస్సులో వాణిజ్యం, ఆర్థిక సహకారంపై కీలక నిర్ణయాలు
- షీ-పుతిన్-మోదీ భేటీతో ప్రపంచ వ్యూహాత్మక సమీకరణాలు





## తెలంగాణను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తున్నాం

2047 నాటికి $3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

- భారత్ ఫ్యూచర్ సిటీ.. హైడ్రా, మూసీ పునరుజ్జీవనానికి ప్రాధాన్యం
- పదేళ్ల బీఆర్ఎస్ విధ్వంసాన్ని తుడిచిపెట్టి..
- ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాం 02

- ప్రతి నెల 1వ తేదీనే ఉద్యోగుల వేతనాలు..
- రూ. 1.20 కోట్ల ప్రమాద బీమా
- 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం 'బ్రేక్‌ఫాస్ట్'..
- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- అమెరికాలో ఐఐసీ సమావేశంలో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

## హిందూ ఉత్సవాలకు బిచ్చమెత్తుకోవాలా? 03

బోనాలకు అరకొర నిధులే



- ప్రభుత్వం తీరుపై ఫైర్
- బోనాలకు మరిన్ని నిధులు ఇవ్వాలి
- హిందూ పండుగలకు తగిన నిధులే కావాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్



## లష్కర్ బోనాల జాతర షురూ

సికింద్రాబాద్‌లో అంగరంగ వైభవంగా ప్రారంభమైన లష్కర్ బోనాలు

- ఉజ్జయిని మహంకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- ప్రభుత్వం తరపున తొలి బోనం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం
- భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు..
- 1500 మందితో భారీ బందోబస్త్
- జాతర సందర్భంగా 4వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు

**ముద్ర, సికింద్రాబాద్ :**
సికింద్రాబాద్‌లో ప్రసిద్ధి చెందిన లష్కర్ బోనాల జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించేందుకు ఇవాళ తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. జై మహంకాళి నినాదాలతో సికింద్రాబాద్ వీధులు మార్మోగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మవారికి తొలి బోనం, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు పటిష్ఠమైన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాధారణ భక్తుల కోసం మూడు, బోనాలు సమర్పించే మహిళల కోసం రెండు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. వీఐపీల కోసం మరో క్యూలైన్ సిద్ధం చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక కేంద్రాలను కేటాయించగా, 1500 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్త్ నిర్వహిస్తున్నారు. మిగతా 02లో

## కాళేశ్వరం కష్టమే!



- మూడు బ్యారేజీల్లో 225 వెంట్లలో 217 వెంట్లకు జీపీఆర్ పరీక్షలు
- మేడిగడ్డలో 7 వెంట్ల వద్ద తీవ్రమైన భూగర్భ అనామలీస్
- అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ పలు వెంట్ల వద్ద సమస్యలు
- కేవిటీస్, బోల్డర్లు, దెబ్బతిన్న రాతి పొరలు, సీపేజీ మార్గాల గుర్తింపు
- కేవలం 11 వెంట్ల కింద మాత్రమే ఎలాంటి అనామలీస్ లేవని నివేదిక

మేడిగడ్డ-అన్నారం-సుందిళ్ల బ్యారేజీల కింద భూగర్భంలో తీవ్ర సమస్యలు

సీడబ్ల్యూపీఆర్ఎస్ జీపీఆర్ పరీక్షల్లో సంచలన అంశాలు



**ముద్ర డెస్క్:**
తెలంగాణలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై మరోసారి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి తాజాగా వెలుగులోకి వచ్చిన కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ (CWPRS) నివేదిక కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల దిగువన భూగర్భ పరిస్థితులపై నిర్వహించిన అత్యాధునిక గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (GPR) పరీక్షల్లో అనేక సాంకేతిక లోపాలు, అసాధారణ పరిస్థితులు (అనామలీస్) బయటపడినట్లు నివేదిక వెల్లడించింది. పుణెలోని కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ (CWPRS) డైరెక్టర్ సెల్వబాలన్ తెలంగాణ నీటి పారుదల శాఖకు సమగ్ర నివేదిక సమర్పించినట్లు సమాచారం. ఈ నివేదికలో బ్యారేజీల పునాదుల కింద ఏర్పడిన భూగర్భ పరిస్థితులు, సీపేజీ మార్గాలు, రాతి పొరల దెబ్బతినడం, భారీ బోల్డర్లు, శూన్య ప్రాంతాలు (కేవిటీస్), పూడిక పేరుకుపోవడం వంటి అంశాలను వివరించినట్లు తెలుస్తోంది.

**విస్తృత లోపాలు**
మూడు బ్యారేజీలలో మొత్తం 225 వెంట్లు ఉండగా, వాటిలో 217 వెంట్ల వద్ద క్షేత్రస్థాయిలో జీపీఆర్ పరీక్షలు నిర్వహించారు. సుమారు 30 మీటర్ల లోతు వరకు భూగర్భ పరిస్థితులను విశ్లేషించిన నిపుణులు, చాలా ప్రాంతాల్లో అసాధారణ పరిస్థితులను గుర్తించినట్లు నివేదిక పేర్కొంది. ప్రత్యేకంగా మేడిగడ్డ బ్యారేజీలోని ఏడు వెంట్ల వద్ద అత్యంత తీవ్రమైన అనామలీస్ నమోదైనట్లు గుర్తించారు. ముఖ్యంగా 7వ బ్లాక్‌లోని 17, 18, 19, 20, 21 వెంట్లు, 8వ బ్లాక్‌లోని 7వ వెంట్, 5వ బ్లాక్‌లోని 35వ వెంట్ పరిసరాల్లో భూగర్భ నిర్మాణంలో మార్పులు ఉన్నట్లు గుర్తించారు. మిగతా 02లో

## కాంగ్రెస్‌లో మరో శేర్..!

కూకట్‌పల్లిలో అక్రమ నిర్మాణాల వద్ద అడ్డగోలు వసూళ్లు

- బిల్డర్లను పీల్చి పిప్పి చేస్తున్న వైనం
- అండగా బడా నాయకుడు




అధికార మత్తు.. అడ్డగోలు వసూళ్లు! కాంగ్రెస్ ఖాతాలో మరో 'కలెక్షన్ రాజా' ప్రత్యక్షమయ్యాడు. ఒకరిపై వేటు పడినా కళ్లు తెరవని ఆ 'యువ నేత', కూకట్‌పల్లి బిల్డర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాడు. 'పెద్దాయన' ఆశీస్సులు ఉన్నాయన్న ధీమాతో అక్రమ నిర్మాణాల వద్ద లక్షలు గుంజుతూ, నియోజకవర్గంలోనే కొత్త యముడిలా మారిన ఆ నాయకుడి వెనుక ఉన్న అసలు కథేంటి?

03 -ముద్ర, కూకట్‌పల్లి:

## 03 ప్రపంచానికి ఊరట

ఇరాన్ తో యుద్ధానికి తాత్కాలిక విరామం



- కీలక నిర్ణయం తీసుకున్న ట్రంప్
- సమయం కావాలని వేడుకున్నారు
- ఇరాన్‌తో ఒప్పందం దిశగా అమెరికా..

## రాష్ట్రాలకు కేంద్రం భారీ వరం

అడగకుండానే ₹1.09 లక్షల కోట్ల అడ్వాన్స్ విడుదల



- ముందే పన్నుల వాటా నిధులు.. కేంద్రం సర్ప్రైజ్ 02
- ఉత్తరాదికి పెద్దమొత్తంలో దక్కిన నిధులవాటా
- అత్యధికంగా యూపీకి 19,208, బీహార్ కు 10,845 కోట్లు
- ఏపీకి ₹4,597, తెలంగాణకు ₹2,370 కోట్లు

## తెలంగాణకు మోడీ

ఈ నెలలోనే టూర్



- వరంగల్ విమానాశ్రయానికి భూమి పూజ..
- కాజీపేట రైల్ కోచ్ ఫ్యాక్టరీ జాతికి అంకితం 02
- పర్యటన షెడ్యూల్ ఖరారు చేయనున్న

## మోదీ నా కూతురికి కొత్త జీవితమిచ్చారు 02

- మోదీ క్షమాభిక్షపై రుచికా తల్లి భావోద్వేగం
- ఎఫ్ఐఆర్ ఉపసంహరించాలని విజ్ఞప్తి
- యువతకు మరో అవకాశం ఇవ్వాలన్న తల్లి



ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 03.08.2026
www.mudranews.in | @mudranews






**థైరాయిడ్ తగ్గాలంటే**

రోజూ పరిమిత మోతాదులో అశ్వగంధ నీరు తీసుకోవడం ఒత్తిడిని తగ్గించి, థైరాయిడ్ పనితీరుకు కొంత మద్దతు ఇవ్వొచ్చని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.



# లష్కర్ బోనాల జాతర షురూ

(మొదటి పేజీ తరువాయి)

జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పిస్తుండగా, సోమవారం ఉదయం భవిష్యవాణి వినిపించే రంగం కార్యక్రమం జరగనుంది. ఆ తర్వాత ఏనుగు అంబారీపై అమ్మవారి ఘటాల ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయి.

**పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు**

లష్కర్ బోనాల జాతర నేపథ్యంలో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ నెల 4వ తేదీ ఉదయం వరకు ఆలయం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. జాతర ముగిసే వరకు పొగాకుబజార్, సుభాష్ రోడ్, జనరల్ బజార్ నుంచి మహంకాళి ఆలయానికి వెళ్లే దారులను మూసివేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కర్బాలా క్రాస్‌రోడ్స్ వద్ద వాహనాలను రాణిగంజ్ వైపు మళ్లిస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రాణిగంజ్ క్రాస్‌రోడ్స్ నుంచి మినిస్టర్ రోడ్డు, గోపాలపురం లైన్ మీదుగా ప్రయాణించాలని అధికారులు సూచించారు.

# కాళేశ్వరం కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

అలాగే అన్నారం బ్యారేజీలో 5వ బ్లాక్‌లోని 47వ వెంట్, సుందిళ్ల బ్యారేజీలో 25, 31, 53వ వెంట్ల వద్ద కూడా ఎగువ, దిగువ భాగాల్లో సమస్యలు ఉన్నట్లు అధ్యయనం తేల్చింది. నివేదిక ప్రకారం మూడు బ్యారేజీలలో కలిపి కేవలం 11 వెంట్ల కింద మాత్రమే ఎలాంటి అనామలీస్ కనిపించలేదు. మిగతా వెంట్ల వద్ద చిన్నా, పెద్దా భూగర్భ సమస్యలు నమోదైనట్లు తెలుస్తోంది.

**కేవిటీస్, సీపేజీ ప్రమాదాలపై హెచ్చరిక**

మేడిగడ్డ బ్యారేజీ వద్ద నీటి ఉధృత ప్రవాహాల కారణంగా పునాది కింద ఉన్న ఇసుక కొట్టుకుపోవడంతో రాఫ్ట్ దిగువన పెద్దఎత్తున శూన్య ప్రాంతాలు (కేవిటీస్) ఏర్పడినట్లు నివేదిక పేర్కొంది. ఒకేసారి ఆరు వెంట్ల వద్ద పదికి పైగా అనామలీస్ జోన్లు గుర్తించడం నిపుణుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితులు భవిష్యత్తులో సీపేజీ, పైపింగ్ వంటి ప్రమాదాలకు దారితీసే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరించినట్లు సమాచారం.

**జీపీఆర్ పరీక్షలతో నిర్మాణ లోపాలు నిర్ధారణ కాదు**

అయితే, జీపీఆర్ పరీక్షల ద్వారా భూగర్భ పరిస్థితులను మాత్రమే అంచనా వేయగలమని, వాటి ఆధారంగా నేరుగా నిర్మాణ లోపాలు ఉన్నాయని చెప్పలేమని CWPRS స్పష్టం చేసింది. బ్యారేజీల భద్రతపై తుది నిర్ణయానికి రావాలంటే మరిన్ని శాస్త్రీయ పరీక్షలు అవసరమని సూచించింది. దీనికోసం బోర్‌హోల్ పరిశోధనలు, కోర్ డ్రిల్లింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ (ERT) వంటి ఆధునిక ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించాలని నివేదిక సిఫారసు చేసింది.

**ముందస్తు భూగర్భ పరిశోధనలు లేకపోవడమే కారణమా?**

ప్రాజెక్టు నిర్మాణానికి ముందు సమగ్ర భూగర్భ అన్వేషణ పరీక్షలు చేపట్టకపోవడం వల్లే ఈ సమస్యలు ముందుగా గుర్తించలేకపోయినట్లు ఇంజినీరింగ్ బృందం అభిప్రాయపడినట్లు సమాచారం. నిర్మాణ దశలోనే పునాది కింద ఉన్న భౌగోళిక పరిస్థితులను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి ఉంటే ప్రస్తుతం తలెత్తిన సమస్యలను ముందుగానే అంచనా వేసే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**రాజకీయంగా మరోసారి వేడెక్కనున్న కాళేశ్వరం**

కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పటికే తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన చర్చాంశంగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటన తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య తీవ్ర ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో CWPRS నివేదిక వెలుగులోకి రావడం రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం ఈ నివేదికపై తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా స్పందించలేదు. అలాగే రాష్ట్ర ఇరిగేషన్ శాఖ లేదా సంబంధిత మంత్రులు కూడా ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడిస్తేనే అంశాలపై స్పష్టతనిచ్చే అవకాశం ఉంది.



# ప్రపంచ దృష్టి అంతా భారత్ వైపే

**ముద్ర డెస్క్:**
ప్రపంచ రాజకీయాల్లో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమవుతోంది. వచ్చే నెల భారత్‌లో జరగనున్న బ్రిక్స్ సదస్సు కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరుకానుండటంతో అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆతిథ్యంలో ఈ ముగ్గురు అగ్రనేతలు ఒకే వేదికపై కనిపించే అవకాశం ఉండటం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. సోషల్ మీడియాలో కొందరు విశ్లేషకులు, వ్యాఖ్యాతలు ఈ పరిణామాన్ని "అమెరికాకు పీడకల"గా అభివర్ణిస్తున్నారు. అయితే ఇది అధికారిక అభిప్రాయం కాకుండా, భౌగోళిక రాజకీయ పరిణామాలపై వ్యక్తమవుతున్న ఒక విశ్లేషణ మాత్రమే. ఆర్థిక పరంగా చూస్తే చైనా, భారత్, రష్యా మూడు దేశాలు కలిసి కొనుగోలు శక్తి సమానత్వం ప్రకారం దాదాపు 70.7 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నాయి. ఇది ప్రపంచ మొత్తం ఆర్థిక వ్యవస్థలో సుమారు మూడో వంతు. తయారీ, సాంకేతికత, ఇంధనం, వ్యవసాయం, ఖనిజ వనరులు వంటి రంగాల్లో ఈ మూడు దేశాలకు గణనీయమైన ప్రాధాన్యం ఉంది.

ఈ బ్రిక్స్ సదస్సులో స్థానిక కరెన్సీల్లో వాణిజ్యాన్ని విస్తరించడం, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడం, ఆర్థిక సహకారాన్ని పెంచడం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అంతర్జాతీయ సంస్థల్లో మరింత ప్రాధాన్యం కల్పించడం వంటి అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది.

ఇటీవల బ్రిక్స్ విస్తరణతో ఈ కూటమి ప్రభావం మరింత పెరిగింది. ప్రపంచ జనాభాలో పెద్ద భాగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ వేదిక, భవిష్యత్ అంతర్జాతీయ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థపై మరింత ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే భారత్ తన విదేశాంగ విధానంలో బహుముఖ దౌత్యాన్ని కొనసాగిస్తోంది. అమెరికా, యూరప్, రష్యా, చైనా తదితర దేశాలతో సమతుల్య సంబంధాలను కొనసాగిస్తూనే, గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ వేదికగా జరగనున్న బ్రిక్స్ సదస్సు ప్రపంచ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలుకుతుందా? లేక సాధారణ దౌత్య సమావేశంగానే మిగిలిపోతుందా? అన్నది సదస్సు అనంతరం తేలనుంది.

# తెలంగాణను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తున్నాం

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణలో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తోందని, రాష్ట్ర రూపురేఖలను మారుస్తూ ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా జరిగిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (IOC) ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలను విదేశీ ప్రతినిధులు, ఎన్‌ఆర్‌ఐలకు ఆయన వివరించారు.



**'భారత్ ఫ్యూచర్ సిటీ'**

తెలంగాణను 2047 నాటికి $3 ట్రిలియన్ డాలర్లు, రాబోయే ఐదేళ్లలో $1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047'విజన్ ప్లాన్‌ను అమలు చేస్తోందని తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా నాలుగో మహానగరంగా ముచ్చర్ల ప్రాంతంలో కాలుష్య రహిత నెట్-జీరో ప్రమాణాలతో 'భారత్ ఫ్యూచర్ సిటీ' ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని కోర్ అర్బన్ (CURE), పెరి-అర్బన్ (PURE), రూరల్ అగ్రి (RARE) అని మూడు ఆర్థిక మండలాలుగా వర్గీకరించి వేగంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

**'యంగ్ ఇండియా'తో విప్లవం**

యువతను అంతర్జాతీయ స్థాయి నిపుణులుగా మార్చి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని వెల్లడించారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని నెలకొల్పామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని తెలిపారు.

టాటా గ్రూప్ భాగస్వామ్యంతో రూ. 2,100 కోట్లతో ప్రభుత్వ ఐటీఐలను (ITIs) హైటెక్ డిజిటల్ శిక్షణా కేంద్రాలుగా మారుస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే మోడల్‌గా 'తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రారంభించామన్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం పూట పౌష్టికాహార 'బ్రేక్‌ఫాస్ట్' పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం 'మధ్యాహ్న భోజన' సౌకర్యాన్ని విస్తరించామన్నారు.

**మూసీకి పూర్వవైభవం**

హైదరాబాద్ మహానగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలకు చెక్ పెట్టేందుకు 'హైడ్రా' (HYDRAA) వ్యవస్థను తీసుకొచ్చామని, ప్రకృతి వనరులను కాపాడేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. లండన్ థేమ్స్ నది తరహాలో మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ద్వారా మూసీ నదిని శుద్ధి చేసి, పర్యాటక, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని మొదలుపెట్టామని వెల్లడించారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక విచ్ఛిన్నతకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బీఆర్ఎస్ తీరు వల్ల గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల 15 నుంచి 25వ తేదీ వరకు జీతాలు రాని పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కఠినమైన ఆర్థిక క్రమశిక్షణను పాటించి, విచ్ఛిన్నమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిందని తెలిపారు. ఇప్పుడు ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తున్నామని ప్రకటించారు. అంతేకాకుండా, దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 1.20 కోట్ల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని వెల్లడించారు.

**ఆరు గ్యారెంటీలతో సుపరిపాలన**

ఎన్నికల్లో ఇచ్చిన 'ఆరు గ్యారెంటీలను ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో వేగంగా అమలు చేస్తోందని, ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు వంటి నిర్ణయాలు సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపాయని వివరించారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయమే పునాదిగా సాగుతున్న తెలంగాణ పునర్నిర్మాణంలో విదేశాల్లో ఉన్న తెలుగు ఎన్‌ఆర్‌ఐలు, ఐఓసీ ప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు.

**ఎన్‌ఆర్‌ఐలు భాగస్వాములు కావాలి**

రీజినల్ రింగ్ రోడ్డు (RRR) వేగవంతం చేయడం, మెట్రో రైలు రెండో దశ విస్తరణతో పాటు అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా రాబట్టడం వల్ల తెలంగాణ తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. అమెరికాలోని తెలుగు ఎన్‌ఆర్‌ఐలు, పారిశ్రామికవేత్తలు స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి రాకేష్ రెడ్డి, కాలే యాదయ్య, దొంతి మాధవరెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు హనుమాన్ల ఝాన్సీ రెడ్డి, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# తెలంగాణకు మోదీ

**ముద్ర డెస్క్:**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెలలో తెలంగాణలో పర్యటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యం కలిగిన రెండు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది. వరంగల్ విమానాశ్రయ నిర్మాణానికి భూమిపూజ చేయడంతో పాటు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని జాతికి అంకితం చేసే కార్యక్రమాలను ఒకే వేదికపై నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర అధికార యంత్రాంగం ఏర్పాట్లు వేగవంతం చేసింది. ప్రధాని కార్యాలయం నుంచి సానుకూల సంకేతాలు అందిన నేపథ్యంలో అధికారిక పర్యటన షెడ్యూల్‌ను త్వరలో ఖరారు చేసి ప్రకటించే అవకాశముంది. తెలంగాణలో ప్రస్తుతం శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మాత్రమే ప్రధాన విమాన సేవలను అందిస్తోంది. రాష్ట్రంలోని రెండో ప్రధాన విమానాశ్రయంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, ప్రాథమిక అనుమతులు, సన్నాహక పనులు పూర్తయ్యాయి. దీంతో విమానాశ్రయ నిర్మాణానికి అధికారికంగా శ్రీకారం చుట్టేందుకు భూమిపూజ నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉత్తర తెలంగాణ జిల్లాలకు విమాన ప్రయాణ సౌకర్యాలు మరింత చేరువ కానున్నాయి. పారిశ్రామిక, విద్యా, వైద్య, పర్యాటక రంగాలకు కూడా ఊతమివ్వనుంది.

**రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభానికి సిద్ధం**

ఇక వరంగల్ సమీపంలోని మడికొండ వద్ద నిర్మితమైన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభానికి కూడా రంగం సిద్ధమైంది. తెలంగాణ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూసిన ఈ ప్రాజెక్టు పూర్తి కావడంతో దానిని ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. 1980లలో కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీ తర్వాత పంజాబ్‌కు తరలిపోవడంతో ఈ అంశం తెలంగాణ ఉద్యమంలో కీలక డిమాండ్‌గా మారింది. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం తిరిగి ఈ ప్రాజెక్టును మంజూరు చేయగా, నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

**ఒకే పర్యటనలో రెండు కార్యక్రమాలు**

వరంగల్ విమానాశ్రయం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఒకదానికొకటి సమీపంలో ఉండటంతో రెండు కార్యక్రమాలను ఒకే పర్యటనలో నిర్వహించాలని ప్రధాని కార్యాలయం సూచించినట్లు సమాచారం. దీనివల్ల భద్రతా ఏర్పాట్లు, అధికారిక కార్యక్రమాల నిర్వహణ మరింత సులభం కానుంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పర్యటన ఏర్పాట్లపై సమన్వయం ప్రారంభించినట్లు తెలిసింది.

# మోడీ నా కూతురికి కొత్త జీవితం ఇచ్చారు

**ముద్ర డెస్క్ :**
సోషల్ మీడియాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసి చిక్కుల్లో పడిన యువతి రుచికా సింగ్‌ను ప్రధాని పెద్ద మనసుతో క్షమిస్తున్నట్లు ప్రకటించడం పట్ల ఆమె కుటుంబం తీవ్ర భావోద్వేగానికి గురైంది. ఈ నిర్ణయంపై రుచికా సింగ్ తల్లి మీడియాతో మాట్లాడుతూ ప్రధానికి నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఘటన ప్రస్తుతం దేశవ్యాప్తంగా నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది.

**ప్రధాని పెద్ద మనసు..**

తన కుమార్తె చేసిన తప్పును గుర్తుచేసుకుంటూ రుచికా తల్లి కంటినీరు పెట్టుకున్నారు. "నా కూతురు తెలియక పెద్ద తప్పు చేసింది. అయినప్పటికీ ఆమె భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని క్షమించి కొత్త జీవితాన్ని ప్రసాదించిన ప్రధాని మోదీకి చేతులెత్తి దండం పెడుతున్నాను. ఆయన పుట్టినరోజు సందర్భంగా మా కుటుంబానికి ఇంతకంటే పెద్ద బహుమతి మరొకటి ఉండదు" అని ఆమె అన్నారు. అంతేకాకుండా రుచికా సింగ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్ ను కూడా ఉపసంహరించుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను, ప్రభుత్వాన్ని ఆమె అభ్యర్థించారు.

**మారేందుకు అవకాశమివ్వాలి**

యువత ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితులపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆవేశం, అవగాహన రాహిత్యం వల్లే యువత ఇలాంటి పొరపాట్లు చేస్తోందని పేర్కొన్నారు. "తప్పు చేసిన వారిని కేవలం శిక్షించడమే కాకుండా వారు తమను తాము దిద్దుకుని మారేందుకు ఒక అవకాశం ఇవ్వడం కూడా సమాజ బాధ్యత. ఈ ఘటన ద్వారా నా కుమార్తె చాలా పెద్ద పాఠమే నేర్చుకుంది" అని ఆమె వెల్లడించారు.

**టీనేజర్లకు సోషల్ మీడియా నిషేధించాలి**

ఈ సందర్భంగా సోషల్ మీడియా దుష్ప్రభావాలపై రుచికా తల్లి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పసి వయసులోనే పిల్లలు సోషల్ మీడియా బారిన పడి దారితప్పుతున్నారని అన్నారు. 20 ఏళ్లలోపు వయసున్న పిల్లలకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికలను వినియోగించకుండా నిషేధం విధించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. కొందరు స్వార్థపరులు ఈ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పిన్న వయస్కులైన యువతను తమ రాజకీయ లేదా స్వంత ప్రయోజనాల కోసం తప్పుదారి పట్టిస్తున్నారని ఆమె ఆరోపించారు. సరైన పరిణతి లేని వయసులో పిల్లలు సోషల్ మీడియా ప్రభావానికి లోనై ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకుని జీవితాలను పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# రాష్ట్రాలకు కేంద్రం భారీ వరం..

**ముద్ర డెస్క్ :**
రాష్ట్రాల ఆర్థిక పరిస్థితికి ఊరటనిచ్చే కీలక నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అభివృద్ధి పనులు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాలు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా కొనసాగేందుకు కేంద్ర పన్నుల వాటాలో భాగంగా ₹1,09,019 కోట్లను అడ్వాన్స్ రూపంలో రాష్ట్రాలకు విడుదల చేసింది. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన విడుదలయ్యే పన్నుల వాటా నిధులకు అదనంగా, ఈసారి పది రోజుల ముందుగానే భారీ మొత్తాన్ని రాష్ట్రాల ఖజానాల్లో జమ చేయడం విశేషం.

ఈ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వాలకు తక్షణ ఆర్థిక వెసులుబాటు లభించనుంది. అభివృద్ధి పనుల వేగం పెరగడంతో పాటు మూలధన వ్యయాన్ని పెంచేందుకు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కొరత లేకుండా చూడడమే కేంద్రం లక్ష్యంగా అడ్వాన్స్ విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది.

**ఉత్తరప్రదేశ్‌కు అత్యధిక నిధులు**

రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌కు అత్యధికంగా ₹19,208 కోట్లు కేటాయించగా, బీహార్‌కు ₹10,845 కోట్లు లభించాయి. పెద్ద జనాభా, విస్తృత అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ రాష్ట్రాలకు అధిక మొత్తంలో నిధులు కేటాయించినట్లు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ఏపీకి ₹4,597 కోట్లు, తెలంగాణకు ₹2,370 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులు రాష్ట్రాల నగదు ప్రవాహాన్ని మెరుగుపరచడంతో పాటు అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల నిర్మాణ పనులకు ఊతమివ్వనున్నాయి.

**రాష్ట్రాలకు భారీ ఊరట**

ప్రస్తుతం అనేక రాష్ట్రాలు సంక్షేమ పథకాలు, వేతనాలు, మౌలిక వసతుల నిర్మాణానికి భారీగా నిధులు ఖర్చు చేస్తున్న నేపథ్యంలో కేంద్రం ముందుగానే ఈ అడ్వాన్స్ విడుదల చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణ నెలవారీ పన్నుల వాటాకు ఇది అదనంగా ఉండటంతో రాష్ట్రాలపై తక్షణ ఆర్థిక ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో జాప్యం లేకుండా ముందుకు సాగేందుకు అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్థిక సంవత్సరం మధ్యలో ఇలాంటి భారీ అడ్వాన్స్ విడుదల చేయడం రాష్ట్రాలకు పెద్ద ఊరటగా మారనుంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 03.08.2026
www.mudranews.in | @mudranews



### థైరాయిడ్ తగ్గాలంటే అల్లం టీ

అల్లంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఇన్ఫ్లమేషన్‌ను తగ్గించడంలో సహాయ పడతాయి. అలసటను కూడా తగ్గించవచ్చు.




# ఇరాన్ తో యుద్ధానికి తాత్కాలిక విరామం

**ముద్ర డెస్క్ :** అమెరికా–ఇరాన్ మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతల నడుమ ఒక ఊరటనిచ్చే పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌పై భారీ స్థాయిలో సైనిక దాడి చేసేందుకు అమెరికా సైన్యం సర్వసిద్ధంగా ఉన్నప్పటికీ ఆ ప్రణాళికలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరు దేశాల నడుమ శాంతి ఒప్పందం కుదిరే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తుండటమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని తెలుస్తోంది.



**'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ కీలక వ్యాఖ్యలు**

అధ్యక్షుడు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ వివరాలను వెల్లడించారు. పశ్చిమాసియాలోని పలు మిత్రదేశాలతో పాటు ఇరాన్ కూడా దాడులను నిలిపివేయాలని అమెరికాను కోరినట్లు ఆయన తెలిపారు. "ప్రపంచ ప్రయోజనాలు, ప్రాంతీయ శాంతిభద్రతలు.. ఇరాన్ మనుగడను దృష్టిలో ఉంచుకుని సైనిక చర్యలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నాం. యుద్ధం కంటే చర్చల ద్వారా లభించే పరిష్కారమే ఎల్లప్పుడూ శ్రేయస్కరం" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా మద్దతు తెలిపారని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే దీనిపై ఇజ్రాయెల్ ప్రభుత్వం నుండి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

**హెచ్చరికలు.. క్లిష్టమైన పరిస్థితులు**

ఒకవైపు చర్చల మాటలు వినిపిస్తున్నప్పటికీ ప్రాంతీయంగా భయాందోళనలు పూర్తిగా తొలగిపోలేదు. ఈ వారాంతంలో తమపై ఎలాంటి సైనిక చర్యలకు దిగొద్దని ఇరాన్, అమెరికాను తీవ్రంగా హెచ్చరించింది. ఒకవేళ దాడులు జరిగితే ఊహించని రీతిలో ప్రతీకారం ఉంటుందని స్పష్టం చేసింది. సౌదీ అరేబియా, యూఏఈలోని కీలక చమురు క్షేత్రాలు ఖతార్, ఇజ్రాయెల్ ప్రధాన సహజ వాయువు (గ్యాస్) ప్రాజెక్టులను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది.

**మధ్యవర్తిత్వంలో ఖతార్, పాకిస్థాన్**

ఈ ఉద్రిక్తతలను తగ్గించి ఇరు దేశాలను చర్చల మేజాపైకి తీసుకురావడానికి అంతర్జాతీయంగా మధ్యవర్తిత్వ ప్రయత్నాలు వేగవంతమయ్యాయి. ఖతార్ , పాకిస్థాన్ దేశాలు విడివిడిగా అమెరికా, ఇరాన్ ఉన్నతాధికారులతో దౌత్యపరమైన చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

**ఆశలు రేపుతున్న ప్రతిపాదిత అంశాలు**

ఈ ఒప్పందం గనుక కార్యరూపం దాల్చితే పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు బలమైన పునాది పడుతుంది. హోర్ముజ్ జలసంధి వాణిజ్య నౌకల రవాణాకు దీనిని పూర్తిగా పునరుద్ధరించడం... ఇరాన్ తన వివాదాస్ప ద అణు కార్యక్రమాలను నిలిపివేయడం. అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో ధరలు స్థిరపడటంతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం పడుతుంది.ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మొత్తం ఈ ప్రతిపాదిత ఒప్పందంపైనే నెలకొంది. చర్చలు విజయవంతమై యుద్ధ మేఘాలు తొలగిపోతాయో లేక ఉద్రిక్తతలు నెలకొంటాయో చూడాలి.

# కాంగ్రెస్ లో మరో 'శేర్'...!

- **కూకట్ పల్లిలో అక్రమ నిర్మాణాల వద్ద అడ్డగోలు వసూళ్లు**
- **బిల్డర్లను పీల్చి పిప్పి చేస్తున్న వైనం**
- **అండగా బడా నాయకుడు**



**ముద్ర, కూకట్‌పల్లి :** అధికార కాంగ్రెస్ పార్టీలో కొంతమంది నాయకులు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కూకట్ పల్లి నియోజకవర్గంలో వారికి ప్రధాన ఆధాయ వనరులుగా అక్రమ నిర్మాణాలను ఎంచుకుంటున్నారు. ఇప్పటికే ఓ నియోజకవర్గస్థాయి నాయకుడు విచ్చలవిడి అవినీతికి పాల్పడుతున్నాడని పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. ఇది మిగతా వారికి హెచ్చరిక అవుతుందని అందరూ భావించారు. కానీ ఇదే తరహాలో మరో యువ నాయకుడు అవతరించాడు. కాకుంటే ఇతను అతి జాగ్రత్తగా ఇక్కడ పార్టీని నడిపిస్తున్న ఓ బడా నాయకుడి అండదండలతో తన అక్రమ దందాను నడిపిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ నాయకుడు గతంలో కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగంలో పనిచేసి, ప్రస్తుతం యువజన కాంగ్రెస్ నాయకుడిగా ఉన్నారు. తన స్వప్రయోజనం కోసం అధికారాన్ని అడ్డం పెట్టుకొని అధికార యంత్రాంగాన్ని బెదిరిస్తూ తన అక్రమ వసుళ్ళ భాగోతాన్ని యదేచ్ఛగా కొనసాగిస్తున్నారని నియోజకవర్గంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడ అక్రమ నిర్మాణం జరిగితే అక్కడికి వెళ్లడం దానికి అధికారుల నుండి ఎలాంటి అడ్డంకులు రాకుండా చూసుకుంటానని చెప్పి లక్షల్లో వసూలు చేయడం పనిగా పెట్టుకున్నాడని కోడై కూస్తున్నారు.. భవన నిర్మాణదారుడు ఇవ్వడానికి ససేమిరా అంటే అతనే ఫిర్యాదు చేసి అధికారుల ద్వారా అడ్డంకులు సృష్టించి బిల్డర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోతున్నారు. సునాయాసంగా లక్షలు సంపాదించేందుకు అక్రమ నిర్మాణాల వద్ద వసూళ్లు కార్యక్రమాన్ని అడ్డూ అదుపు లేకుండా కొనసాగిస్తున్నాడని చెబుతున్నారు..

ఇది ప్రస్తుతం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. అధికార పార్టీ నాయకులు అక్రమాలను అరికట్టి, ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడేందుకు పనిచేయాలి. కానీ అందుకు భిన్నంగా వసూల్ రాజా వ్యవహరించడం రానురాను పార్టీకి తలవంపులు తీసుకువస్తుందని కొంతమంది కాంగ్రెస్ నాయకులే బాహాటంగా చర్చించుకుంటున్నారు. కాకుంటే నియోజకవర్గంలో పార్టీని ముందుండి నడిపిస్తున్న ఓ కీలక నేత అండదండలు ఇతనికి పూర్తిస్థాయిలో ఉండటంతో ఈ వ్యవహారంపై ఎవరు నోరు మెదపడం లేదు. దీంతో ఆ నాయకుడు నియోజకవర్గంలో మరో శేర్ అంటూ ప్రజలు వాపోతున్నారు.

గతంలో మూసాపేట్ ప్రాంతానికే పరిమితమైన ఇతని అవినీతి వ్యవహారం ఇప్పుడు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించింది. దీంతో బిల్డర్లు బెంబేలెత్తుతున్నారు. అతని డిమాండ్ కు ఒప్పుకుంటే సరి.. లేకుంటే అతనే వారికి యముడిగా మారుతున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. అతని కోరిక నెరవేర్చడమే బిల్డర్లకు శరణ్యంగా మారింది. ఇతని వేధింపుల నుండి బయటపడే రోజులు ఎప్పుడు వస్తాయో అంటూ బిల్డర్లు వాపోతున్నారు. పార్టీ అధిష్టానం ఈ వ్యవహారంపై దృష్టి సారించి ఆ నాయకుని అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని, లేకుంటే పార్టీ ప్రతిష్ట మంట కలిసి పోతుందని, తద్వారా పార్టీకి తీరని నష్టం జరుగుతుందని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరుతున్నారు.

## మంత్రి పొన్నం 'బోనాల' విందు..

**హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు**



**ముద్ర, సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికార నివాసంలో ఆదివారం సంప్రదాయబద్ధంగా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఏర్పాటు చేసిన బోనాల విందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో మంత్రి పొన్నం ప్రభాకర్ అతిథులను ఆప్యాయంగా ఆహ్వానించి, తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేశారు.



అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లి మల్లమ్మ, సతీమణి మంజుల, కుమారులు పృథ్వీ, ప్రణవ్ ,వారి సోదరులు వారి కుటుంబ సభ్యులు, బంధువులతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ కుటుంబ సభ్యులను పలకరించారు. ఈ ఆత్మీయ వాతావరణం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బోనాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తి, సంప్రదాయం, ఆతిథ్యానికి ప్రతీకగా నిలవడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఆత్మీయ సమావేశంగా నిలిచింది.

# హిందూ ఉత్సవాలకు బిచ్చమెత్తుకోవాలా?

- **బోనాలకు అరకొర నిధులే**
- **కాంగ్రెస్ ప్రభుత్వం తీరు పై ఫైర్**
- **బోనాలకు మరిన్ని నిధులు ఇవ్వాలి**
- **హిందూ పండుగలకు తగిన నిధులే కావాలి**
- **కేంద్ర మంత్రి బండి సంజయ్**



**ముద్ర, సికింద్రాబాద్:** రాష్ట్రంలో హిందూ పండుగలు, ఉత్సవాల నిర్వహణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, నిధుల కోసం హిందువులు బిచ్చమెత్తుకునే దుస్థితి నెలకొందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ ఆయన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. రంజాన్ పండుగ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్లు కేటాయించిందని, అయితే 80 శాతానికి పైగా ఉన్న హిందువులు నిర్వహించుకునే బోనాల ఉత్సవాలకు మాత్రం కేవలం రూ.20 కోట్లు ఇవ్వడం సరికాదని ఆయన విమర్శించారు. జంట నగరాల్లోని 3 వేలకు పైగా దేవాలయాల్లో బోనాలు ఘనంగా జరుగుతుంటే, ప్రభుత్వం ఇచ్చిన అరకొర నిధులు ఏ మూలకు సరిపోవని ప్రశ్నించారు. బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి నిధులు కేటాయించకుండా వదిలేశారని బండి సంజయ్ మండిపడ్డారు.

**కాంగ్రెస్ అంటే ముస్లిం.. ముస్లిం అంటే కాంగ్రెస్**

ఆలయ ప్రాంగణంలో తీవ్రమైన ఎండలో గంటల తరబడి క్యూలైన్లలో నిలబడే భక్తులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించకపోవడం శోచనీయమని అన్నారు. సీఎం, మంత్రులు వచ్చి కేవలం దర్శనం చేసుకుని వెళ్లిపోతే సరిపోదని, భక్తుల ఇబ్బందులను పట్టించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 'కాంగ్రెస్ అంటేనే ముస్లిం... ముస్లిం అంటేనే కాంగ్రెస్' అని సీఎం రేవంత్ రెడ్డి అనడమే.. హిందూ పండుగల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న చులకన భావానికి నిదర్శనమని విమర్శించారు. బీఆర్ఎస్ సైతం గతంలో బోనాల ఉత్సవాలకు నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం వహించిందని గుర్తుచేశారు. ముందుముందు రాబోయే గణేష్ ఉత్సవాలతో పాటు అన్ని హిందూ పండుగలకు రాష్ట్ర ప్రభుత్వం జనాభా నిష్పత్తి ప్రాతిపదికన నిధులను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉత్సవాల నిర్వహణలో తమ హక్కులను కాపాడుకోవడానికి, ఆత్మగౌరవాన్ని చాటుకోవడానికి హిందూ సమాజమంతా జాగృతమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైందని కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు.

### వైకాపా ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు

**ముద్ర న్యూస్ కర్నూలు :** కర్నూలు జిల్లా ఆలూరు వైకాపా ఎమ్మెల్యే విరూపాక్షిని పోలీసులు అరెస్టు చేశారు. ఆయనతో సహా 15 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

## సకాలంలో పన్నుల్లో వాటా... అభివృద్ధికి ఊతం

**అదనపు పన్నుల వాటా కేటాయింపుపై ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు**



**ముద్ర, అమరావతి :** అదనపు పన్నుల వాటా కేటాయింపుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన విడుదల య్యే పన్నుల వాటాతో పాటు అదనంగా రూ.4,597 కోట్ల పన్నుల వాటాను కేటాయిం చినందుకు ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎక్స్ వేదికగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం చేసిన పన్నుల వాటా కేటాయింపుతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలం చేకూరుస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల తరపున ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అదనపు పన్నుల వాటా విడుదలతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి నిరంతరం అందిస్తున్న సహకారం రాష్ట్ర పురోగతికి ఎంతో దోహదపడుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఏపీ ప్రభుత్వం-ఆస్ట్రేలియా మధ్య కీలక ఒప్పందాలు

**-లోకేశ్ సమక్షంలో ఖరారు**



**ముద్ర, అమరావతి :** ఏపీ ప్రభుత్వం, ఆస్ట్రేలియాలోని ప్రముఖ విద్యా, పరిశోధన, పారిశ్రామిక సంస్థల మధ్య క్లీన్ ఎనర్జీ, సమ్మిళిత విద్య, మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో నాలుగు ఒప్పందాలు కుదిరాయి. విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఇటీవల జరిపిన ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా అక్కడి ప్రతినిధులను ఆహ్వానించి, ఏపీలో ఉన్న రాయితీలను వివరించిన ఫలితంగా ఈ చరిత్రాత్మక భాగస్వామ్యం సాధ్యమైంది. ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్, ఆస్ట్రేలియా సహాయ మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో ఈ ఎంవోయూలపై ఇరుపక్షాల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందాలలో భాగంగా విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్, ఐఐటీ తిరుపతి, సిడ్నీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ సంయుక్తంగా ఐఐటీ తిరుపతిలో 'సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయనున్నాయి. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను సోలార్ పీవీ తయారీ, సోలార్ ప్యానెళ్ల రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ పరిశోధనలకు జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే కాకుండా, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా UNSW ప్రత్యేక విద్యా శిక్షణా కార్యక్రమాలను రూపొందిస్తుంది. సమ్మిళిత విద్యను బలోపేతం చేసేందుకు UNSW, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఏపీ సమగ్ర శిక్ష కలిసి ఆటిజం, న్యూరోడైవర్స్ విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయుల సామర్థ్యం పెంపునకు మరో ఒప్పందం చేసుకున్నాయి. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఆస్ట్రేలియాకు చెందిన రీబౌండ్ డింపుల్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఎంపిక చేసిన విద్యాసంస్థల్లో ఉచితంగా సాంకేతిక ఆధారిత వర్చువల్ కౌన్సెలింగ్ పైలట్ ప్రాజెక్టును అమలు చేయనున్నాయి. అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు, వృత్తి విద్యా సర్టిఫికేషన్ కోసం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆస్ట్రేలియాకు చెందిన డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్‌ల మధ్య నాలుగో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందాలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబును ఆస్ట్రేలియా సహాయ మంత్రి జూలియన్ హిల్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలుసుకుంది. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, పెట్టుబడుల కు గల విస్తృత అవకాశాలను ఆస్ట్రేలియా బృందానికి సీఎం వివరించారు.

## పాత్రికేయులు ప్రమాణాలను, విశ్వసనీయతను పెంచుకోవాలి

**ఐ.జే.యు. సెక్రెటరీ జనరల్ డి.సోమసుందర్ పిలుపు**




**ముద్ర, తాడేపల్లి గూడెం:** పాత్రికేయులు నైపుణ్యాన్నీ ప్రమాణాలనూ పెంపొందించుకుని వృత్తిలో రాణించాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ సెక్రటరీ జనరల్ డి. సోమసుందర్ పిలుపు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎ.పి.యు. డబ్ల్యు.జే.) పశ్చిమగోదావరి జిల్లా శాఖ కార్యవర్గ విస్తృత సమావేశం ఆదివారం తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వి.ఎస్. సాయిబాబా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐ.జే.యు. సెక్రెటరీ జనరల్ డి.సోమసుందర్ మాట్లాడుతూ మీడియా వృత్తి స్వరూప స్వభావాలలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు వృత్తి శిక్షణ ఇచ్చేందుకు యూనియన్ ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. ఇప్పటికీ మీడియా అకాడమీ ద్వారా జరుగుతున్న ప్రయత్నం పాత్రికేయుల వృత్తి ప్రమాణాలను పెంచడమేనని, మంచి ప్రమాణాలున్న మీడియా మాత్రమే గౌరవాన్ని, ప్రజల నమ్మకాన్ని పొందుతుందని సోమసుందర్ అన్నారు. దేశవ్యాప్తంగా పాత్రికేయులపై దాడులు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేసారు. జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం చేయాలని యూనియన్ గట్టిగా పోరాటం చేస్తున్నదని డి.సోమసుందర్ వివరించారు. పని చేసే జర్నలిస్టులు అందరికీ అక్రెడిటేషన్, హెల్త్ కార్డు, ప్రమాద బీమా, ఇళ్ల స్థలాలు, వెటరన్ జర్నలిస్ట్ లకు పింఛను, సంక్షేమ నిధి, రైల్వే రాయితీ పునరుద్ధరణ వంటివి సాధించడానికి యూనియన్ పోరాడుతున్నదన్నారు. అందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా సిబ్బంది సంఘటితం కావాలని సోమసుందర్ పిలుపు ఇచ్చారు. ఆగస్ట్ 17 నుండి ఏడాది పొడవు నా రాష్ట్రవ్యాప్తంగా ఎ.పి.యు.డబ్ల్యు.జే. సప్తతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిందని తెలిపారు. పాలడుగు సతీష్, ఐ.జే.యు. జాతీయ కౌన్సిల్ సభ్యులు పి.టి.వెంకటేశ్వరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యర్రంశెట్టి గిరిజాపతి, జిల్లా ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 02.08.2026

4 | వేదిక
Peoples Voice
మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## ఇదీ మన విద్యావ్యవస్థ దుస్థితి

### దేశంలో లక్షకుపైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు

దేశంలో ప్రభుత్వ పాఠశాలలు రోజురోజుకూ బలహీన పడుతుంటే.. ప్రభుత్వ విద్యావ్యవస్థ బలహీనపడుతోంది. దీంతో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చేస్తున్నాయి. అయితే ఇందుకు ప్రధాన కారణం.. పాలకుల నిర్లక్ష్యమే. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించకపోవడంతో ప్రభుత్వ పాఠశాల విద్య కుంటుపడుతోంది. దేశం లో పాఠశాల విద్యావ్యవస్థలో తీవ్రమైన అసమానతలను అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా లక్షకు పైగా పాఠశాలలు కేవలం ఒక్క ఉపాధ్యాయుడితోనే నడుస్తున్నాయి. ఇది విద్యా నాణ్యత, ఉపాధ్యాయుల భారం, విద్యార్థుల అభివృద్ధి వంటి అంశాలపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**జాతీయ స్థాయి పరిస్థితి**

యూడైస్ ప్లస్ 2025–26 డేటా ప్రకారం దేశంలో మొత్తం 1,00,843 పాఠశాలలు సింగిల్ టీచర్‌తో పనిచేస్తున్నాయి. మొత్తం పాఠశాలల సంఖ్యతో పోలిస్తే ఇది చాలా పెద్ద సంఖ్య. జాతీయ స్థాయిలో విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తి సాధారణంగా నిబంధనల్లో ఉన్నా, అనేక ప్రాంతాల్లో ఉపాధ్యాయుల పంపిణీ అసమానంగా ఉంది. ఒకే ఉపాధ్యాయుడు అనేక తరగతులకు, అనేక విషయాలకు బాధ్యత వహించాల్సి రావడం వల్ల బోధన నాణ్యత దెబ్బతింటోంది.

**రాష్ట్రాల వారీగా పరిస్థితి**

ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎక్కువగా ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో 16,357 సింగిల్ టీచర్ పాఠశాలలు ఉన్నాయి. ఇది జాతీయ మొత్తంలో 16 శాతానికి పైగా ఉంది. తర్వాతి స్థానాల్లో జార్ఖండ్ (9,827), మహారాష్ట్ర (9,269) ఉన్నాయి. కర్ణాటక, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కూడా గణనీయమైన సంఖ్యలో ఇలాంటి పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడు రాష్ట్రాలు కలిసి దేశంలోని సింగిల్ టీచర్ పాఠశాలల్లో దాదాపు 65 శాతంఉన్నాయి.

**విద్యా నాణ్యతపై ప్రభావం**

ఒక్క ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలల్లో సాధారణంగా మల్టీ–గ్రేడ్ టీచింగ్ జరుగుతుంది. ఒకే గదిలో వివిధ తరగతుల విద్యార్థులకు బోధించాల్సి రావడంతో వ్యక్తిగత దృష్టి తగ్గుతుంది. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. ఉపాధ్యాయుడు హాజరు, పరిపాలన, బోధన అన్నింటినీ ఒక్కరే చూసుకోవాల్సి రావడంతో భారం పెరుగుతోంది. దీని ఫలితంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, ఉన్నత విద్యలో ప్రవేశం, నైపుణ్య అభివృద్ధి ప్రభావితమవుతాయి.
ఉపాధ్యాయుల నియామకాలు, వారి నియమిత స్థానాలకు పంపిణీ, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే అవకాశాలు వంటి అంశాల్లో లోపాలు ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో పాఠశాలల సంఖ్య ఎక్కువగా ఉన్నా, ఉపాధ్యాయుల నియామకాలు సరిపడా జరగడం లేదు. జాతీయ విద్యా విధానం లక్ష్యాలను సాధించాలంటే ఉపాధ్యాయుల సమాన పంపిణీ, శిక్షణ, మౌలిక సదుపాయాల మెరుగుదల అవసరం. ఏకోపాధ్యాయ పాఠశాలలు లక్షలాది మంది పిల్లల భవిష్యత్తుకు సంబంధించినవి. ఒక్క ఉపాధ్యాయుడితో నడిచే పాఠశాలల సంఖ్యను తగ్గించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. విద్య అందరికీ సమానంగా, నాణ్యంగా అందాలంటే ఈ అసమానతలను తొలగించాలి.



## దాంపత్యం

దాంపత్యం అంటే ఫోటోల లో నవ్వుతూ కనిపించే రెండు ముఖాల కథ కాదు. ఒకే ఇంట్లో వేలసార్లు మనస్పర్థలు వచ్చినా, బయటివారికి తెలియకుండా మళ్లీ మళ్లీ కలిసిపోయే రెండు హృదయాల ప్రయాణమే దాంపత్యం.`

భార్యాభర్తల మధ్య ప్రేమ మాత్రమే ఉండదు. కోపం ఉంటుంది. అహంకారం ఉంటుంది. బాధ ఉంటుంది. రోజుల తరబడి మాట్లాడుకోని మౌనం కూడా ఉంటుంది. "ఇతను ఎప్పటికీ మారడు" అనే భార్య వేదన ఉంటుంది. "ఆమె నన్ను అర్థం చేసుకోవడం లేదు" అనే భర్త మనోవేదన కూడా ఉంటుంది.`అయినా చూడండి... అదే భార్య, భర్త ఆలస్యంగా ఇంటికి వస్తే తలుపు తెరుచుకున్న శబ్దానికి మేల్కొంటుంది. అదే భర్త, భార్య భోజనం చేయలేదని తెలిస్తే.. కోపంలో ఉన్నప్పటికీ ఆమె ముందు భోజనం పెడతాడు.

**అదే దాంపత్యం!`**

పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు ఇల్లు సందడిగా ఉంటుంది. వారి చదువు, పెళ్లి, ఉద్యోగం, పిల్లలు... ఇలా వారి జీవితాల్లో తల్లిదండ్రులు పూర్తిగా మమేకమైపోతారు. కానీ ఒక రోజు పిల్లలు తమ తమ జీవితాల్లో ముందుకు వెళ్లిపోతారు. ఇల్లు క్రమంగా నిశ్శబ్దమవుతుంది.అప్పుడు మిగిలేది ఇద్దరే.` ఒకప్పుడు చిరాకుగా అనిపించిన అదే గురక, ఒకరోజు వినిపించకపోతే కళ్లలో నీళ్లు తెప్పిస్తుంది. "ఇంకా మాట్లాడొద్దు" అని మందలించిన అదే స్వరం, ఒకరోజు శాశ్వతంగా వినిపించకపోతే ఇంటి గోడలే వెలితిగా అనిపిస్తాయి. ఒకరు దూరమైన తర్వాత చాలా మంది వచ్చి ఓదార్పు మాటలు చెబుతారు. కానీ రాత్రి మంచం మీద ఖాళీగా మిగిలిన ఆ స్థలాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. మందు ఇచ్చే చేయిని, "భోజనం చేశావా?" అని అడిగే స్వరాన్ని, కోపంలోనూ దాగి ఉన్న ఆప్యాయతను ఎవరూ తిరిగి తీసుకురాలేరు.`

అందుకే గుర్తుంచుకోండి.. అత్యుత్తమ జంట అంటే ఎప్పుడూ గొడవపడని జంట కాదు. గొడవల తర్వాత కూడా ఒకరినొకరు విడిచి వెళ్లని జంటే నిజమైన దాంపత్యానికి నిదర్శనం.`
దాంపత్యంలో ప్రేమకంటే గొప్పది అన్యోన్యత. అన్యోన్యతకంటే గొప్పది సహనం. సహనం కంటే గొప్పది... చివరి వరకు ఒకరికి ఒకరు తోడుగా ఉండాలనే మనసు.` చిలిపితనం, సిగ్గు, గొడవలు, మౌనం, కష్టాలు, సుఖాలు, కన్నీళ్లు, నవ్వులు, పరస్పర అవగాహన—ఇవన్నీ కలిసి దాంపత్యాన్ని పవిత్రంగా నిలబెడతాయి.` జీవించి ఉన్నప్పుడే జీవిత భాగస్వామి విలువను గుర్తించండి. ఎందుకంటే వారు లేనప్పుడు కార్చే కన్నీటి కంటే, వారు ఉన్నప్పుడే చూపే ప్రేమ, గౌరవం, ఆదరణ మరింత పవిత్రమైనవి.`

**గుర్తుంచుకోండి..**

జీవితంలో పరిపూర్ణమైన జీవిత భాగస్వామి ఎవరూ దొరకరు. కానీ ఒకరి లోపాలను మరొకరు అంగీకరించి, చివరి వరకు చేయి విడవకుండా కలిసి నడిచే జీవిత భాగస్వామి కంటే గొప్ప అదృష్టం మరొకటి లేదు.



మీరు చేసుకునే పుణ్య + పాప కర్మల్ని బట్టే – మీకు భార్యగా, జీవిత భాగస్వా మిగా – తల్లిగా – తండ్రిగా – సోదరుడిగా – తనయుడుగా –కుమార్తెగా –మీ యింటి పశువుగా –కుక్కగా వస్తుంది. ఏరూపంలో నైనా రావచ్చు. అందుకే: మీరు చేసే పనులు సక్రమంగా –చక్కగా చెయ్యండి. అందర్నీ ప్రేమగా చూడండి. అన్నీ బాగానే జరుగుతాయి. ఇక్కడ భగవంతుడు తప్ప వేరే ఏమీలేదు + ఎవ్వరూ లేరు. అందర్నీ భగవంతుని స్వరూపాలుగానే చూడండి. అన్నీ బాగానే జరుగుతాయి

## స్నేహం

**స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలతో**

స్నేహం..
తరగతి గదిలో
పక్క బెంచీపై మొదలైన
పరిచయానికి
కాలం పెట్టిన
అందమైన పేరు

ఒక పెన్సిల్‌ను
రెండు చేతులు
పంచుకున్నప్పుడు
ఒక టిఫిన్‌ను
నాలుగు మనసులు
ఆస్వాదించినప్పుడు..
అక్కడే మొలకెత్తుతుంది
నిజమైన స్నేహం.

మార్కుల పోటీలో
ఎవరు ముందున్నారన్నది కాదు..
పడిపోయిన స్నేహితుడిని
చేయి పట్టి నిలబెట్టిన వాడే
అసలైన విజేత.

పాఠాలు నేర్పేది గురువు అయితే..
జీవితాన్ని నేర్పేది
స్నేహితుడే.
విడిపోయే రోజు
కళ్లలో తడిగా మిగిలేది
పాఠశాల గోడలు కాదు..
వాటి మధ్య వికసించిన
చిరునవ్వుల జ్ఞాపకాలు.



స్నేహితుల దినోత్సవం
అంటే..
బహుమతులు ఇచ్చే
రోజు కాదు..
మనసులు కలిపిన
ఆ పాఠశాల రోజుల్ని
కృతజ్ఞతతో
గుర్తుచేసుకునే పండుగ.

**-సాధన తేరాల, ఖమ్మం**



## ఈ మూడు రకాల పండ్లతో గుండె ఆరోగ్యం..



మనం రోజూ తీసుకునే ఆహారం మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గుండె ఆరోగ్యంగా ఉండడానికి ప్రస్తుత రోజుల్లో ప్రత్యేకమైన ఆహారాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉంది. వీటిలో పండ్లు చాలా ముఖ్యమైనవి. ఫ్రూట్స్ లో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. అయితే గుండె ఆరోగ్యానికి ఏ పండ్లు తీసుకోవాలో తెలియక చాలా మంది అయోమయానికి గురవుతూ ఉంటారు. కొన్ని అధ్యయనలాల ప్రకారం ఈ మూడు రకాల ఫ్రూట్స్ క్రమం తప్పకుండా ఉంటే గుండె సమస్యలు రాకుండా ఉండాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

**బ్లూబెర్రీస్**

బ్లూబెర్రీస్ మార్కెట్లో ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి. వీటిని చాలా మంది చూస్తూ వెళ్తారు. కానీ కొనడానికి ఇష్టపడరు. కానీ ఇందులో ఆంథోసైనిన్స్ అనే సహజ మొక్కల సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. ఇవే బ్లూబెర్రీస్‌కు నీలం లేదా ఊదా రంగును ఇస్తాయి. ఇవి యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉండటంతో శరీరంలోని ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గించడంలో ఉపయోగపడుతాయి. అలాగే రక్తనాళాల పనితీరును మెరుగుపరుస్తాయి. అందువల్ల బ్లూ బెర్రీస్ ను క్రమం తప్పకుండా తీసుకుంటే రక్త ప్రసరణ మెరుగ్గా ఉంటుందని కొన్నిఅధ్యయనాల్లో పేర్కొన్నారు.

**ఆపిల్**

రోజుకు ఒక ఆపిల్ తింటే డాక్టర్ అవసరం ఉండదు.. అనే సామెత ఉన్న విషయం తెలిసిందే. అంటే ఆపిల్‌లో ఎటువంటి పోషకాలు ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. ఇందులో పెక్టిన్ అనే కరిగే ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థలో, కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో బాగా ఉపయోగపడుతుంది. రోజుకు ఒక మీడియం ఆపిల్‌ను తింటే కొలెస్ట్రాల్ రాకుండా ఆరోగ్యంగా ఉండగలుగుతారు.

**నారింజ**

నారింజ ఆరోగ్యకరమైన ఆహారంలో ముఖ్యమైనది. ఇందులో విటమిన్–సీ, పొటాషియం, ఫైబర్, ఫ్లేవనాయిడ్లు వంటి పోషకాలు ఉంటాయి. విటమిన్–సీ శరీరంలోని యాంటీఆక్సిడెంట్ రక్షణకు తోడ్పడుతుంది. పొటాషియం సరైన స్థాయిలో తీసుకోవడం రక్తపోటు నియంత్రణకు సహాయపడవచ్చు.

## బోనాలు.. తెలంగాణ జీవనస్రవంతికి సాంస్కృతిక సాక్ష్యం

తెలంగాణలో ఆషాఢ మాసంలో మహాకాళి, పోచమ్మ, ఎల్లమ్మ వంటి గ్రామదేవతలకు అత్యంత వైభవంగా నిర్వహించే రాష్ట్ర పండుగ బోనాలు. మహిళలు కొత్త కుండల్లో వండిన అన్నం, పాలు, బెల్లంతో నైవేద్యం సమర్పిస్తారు. తెలంగాణ సాంస్కృతిక ఆచారానికి ప్రతీకగా నిలిచిన ఈ పండుగ భక్తి, విశ్వాసం, సంప్రదాయాల సమ్మేళనంగా తరతరాలుగా కొనసాగుతోంది.



ఒక నగరం ఎంత ఆధునికంగా ఎదిగినా... తన మూలాలను మరచిపోకపోతేనే అది నాగరికతకు నిజమైన చిరునామా అవుతుంది. హైదరాబాద్ ఆ విషయాన్ని ప్రతి ఆషాఢ మాసంలో ప్రపంచానికి మరోసారి గుర్తుచేస్తుంది. మెట్రో రైళ్లు పరుగులు తీసే వీధుల్లో, అంతర్జాతీయ కంపెనీలతో కళకళలాడే సైబరాబాద్ మధ్యలో డప్పుల మోత వినిపిస్తుంది. తలపై బోనం మోసిన మహిళల అడుగులు కనిపిస్తాయి. పోతురాజు వీరనృత్యం ఉత్సాహాన్ని నింపుతుంది. ఆ క్షణంలో హైదరాబాద్ కేవలం ఒక మహా నగరం కాదు. తన చరిత్రను, సంస్కృతిని, విశ్వాసాన్ని గుండెల్లో దాచుకున్న తెలంగాణ స్ఫూర్తి దర్శనమిస్తుంది.
పండుగలు కేవలం సెలవు రోజులు కావు. అవి ఒక జాతి జ్ఞాపకాలు. ఒక సమాజం జీవన విధానం. ఒక తరం నుంచి మరో తరానికి చేరే సంస్కృతి వారసత్వం. తెలంగాణకు అలాంటి జీవంతమైన వారసత్వమే బోనాల పండుగ. ఇది కేవలం మతపరమైన వేడుక కాదు. భక్తి, కుటుంబ బంధం, స్త్రీశక్తి, జానపద కళలు, సామాజిక ఐక్యత, స్థానిక సంస్కృతి కలిసిన మహోత్సవం. అందుకే బోనాల ఘడియ రాగానే తెలంగాణ సంస్కృతి తన సంపూర్ణ వైభవాన్ని ఆవిష్కరిస్తుంది. వీధులు పండుగ వాతావరణంతో నిండిపోతాయి. ప్రతి ఇంటిలో అమ్మవారి పేరు వినిపిస్తుంది.
బోనాల చరిత్రను పరిశీలిస్తే, ప్రజల విశ్వాసం ఎంత గొప్పదో అర్థం అవుతుంది. 1813 ప్రాంతంలో హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి విజృంభించిన వేళ ప్రజలు అమ్మవారిని ప్రార్థించి, వ్యాధి నివారణ అనంతరం కృతజ్ఞతగా బోనం సమర్పించారనే చారిత్రక కథనం ప్రచారంలో ఉంది. కాలక్రమేణా ఆ ఆచారం కుటుంబం నుంచి గ్రామానికి, గ్రామం నుంచి నగరానికి, అక్కడి నుంచి తెలంగాణ సాంస్కృతిక గుర్తింపుగా విస్తరించింది. 'బోనం' అంటే భోజనం. కానీ దాని వెనుక ఉన్న భావం కృతజ్ఞత. తల్లి తన బిడ్డకు ప్రేమగా అన్నం పెట్టినట్లే, భక్తుడు అమ్మవారికి ప్రేమతో నైవేద్యం సమర్పించడం.
బోనాల ప్రత్యేకత మహిళల భాగస్వామ్యంలో కనిపిస్తుంది. పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాన్ని తలపై మోసుకుంటూ అమ్మవారి ఆలయానికి వెళ్లే ప్రతి మహిళ భక్తికి ప్రతిరూపం. అది కేవలం ఒక ఆచారం కాదు. కుటుంబ శ్రేయస్సు కోసం, పిల్లల ఆరోగ్యం కోసం, సమాజ సంక్షేమం కోసం చేసే ప్రార్థన. తెలంగాణ సంస్కృతిలో స్త్రీకి ఉన్న గౌరవాన్ని బోనాలు ఎంతో అందంగా ప్రతిబింబిస్తాయి.
భక్తి ఉన్న చోటే విశ్వాసం బలపడుతుంది. తల్లి ఉన్న చోటే ఆశ ఉంటుంది. ఆ ఆశకు, ఆ విశ్వాసానికే బోనాలు ప్రతీక.
బోనాలు అంటే కేవలం బోనం సమర్పించడం మాత్రమే కాదు. పోతురాజు వీరనృత్యం ధైర్యానికి సంకేతం. రంగం ప్రజల విశ్వాసానికి ప్రతిబింబం. ఘటాల ఊరేగింపులు సామూహిక భక్తికి నిదర్శనం. డప్పుల మోత తెలంగాణ జానపద సంస్కృతికి ప్రాణం. ఒక్కో సంప్రదాయం వెనుక ఒక చరిత్ర ఉంది. ఒక్కో ఆచారం వెనుక ఒక సామాజిక సందేశం ఉంది. చెట్టు వేర్లు బలంగా ఉంటేనే కొమ్మలు విస్తరిస్తాయి. అలాగే సంస్కృతి బలంగా ఉంటేనే సమాజం నిలబడుతుంది.
హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగింది. అనేక దేశాల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికత, అంతర్జాతీయ పెట్టుబడులు, భారీ నిర్మాణాలు నగర రూపాన్ని మార్చాయి. కానీ బోనాల పండుగ వచ్చినప్పుడు చార్మినార్ నుంచి సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం వరకు, లాల్ దర్వాజ నుంచి గోల్కొండ ఎల్లమ్మ వరకు, బల్కంపేట ఎల్లమ్మ నుంచి పెద్దమ్మ ఆలయం వరకు కనిపించేది ఒక్కటే—తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే భక్తి ప్రవాహం.
ఆధునికతను ఆలింగనం చేసుకున్న నగరం, సంప్రదాయాన్ని గుండెల్లో పెట్టుకుని ఎలా జీవించాలో హైదరాబాద్ ప్రపంచానికి నేర్పుతోంది.
బోనాల మహోత్సవం సామాజిక ఐక్యతకు కూడా గొప్ప నిదర్శనం. కులం, మతం, భాష, ప్రాంతం అనే భేదాలు అక్కడ కనిపించవు. అమ్మవారి ముందు అందరూ ఒక్కటే. ఇదే హైదరాబాద్ గంగా–జమున తహజీబ్. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ బలం అయితే, బోనాలు దానికి సజీవ రూపం. "కలిసుంటే కలదు సుఖం" అనే సామెతను ఈ పండుగ ప్రతి సంవత్సరం ఆచరణలో చూపిస్తుంది. సమాజాన్ని విభజించే గోడల కంటే, కలిపే విలువలే శాశ్వతమని గుర్తు చేస్తుంది. అందుకే బోనాలు తెలంగాణకు ఒక ఉత్సవం మాత్రమే కాదు... ఒక గుర్తింపు. ఒక భావోద్వేగం. ఒక ఆత్మగౌరవం. హైదరాబాద్ ఎంత ఎత్తుకు ఎదిగినా, దాని హృదయం మాత్రం అమ్మవారి ఆశీస్సులతోనే కొట్టుకుంటుంది. డప్పుల మోత వినిపించినంత కాలం, బోనం మోసే చేతులు ముందుకు సాగినంత కాలం, తెలంగాణ సంస్కృతి చిరస్థాయిగా నిలుస్తుంది.

బోనాలను కాపాడుకోవడం అంటే ఒక పండుగను కాపాడుకోవడం కాదు; తెలంగాణ సంస్కృతిని, మన మూలాలను, భావితరాలకు అందించాల్సిన అమూల్య వారసత్వాన్ని పరిరక్షించడం. బోనాలు నిలిస్తే తెలంగాణ సంస్కృతి నిలుస్తుంది. తెలంగాణ సంస్కృతి నిలిస్తే మన అస్తిత్వం నిలుస్తుంది. అదే మన బాధ్యత. అదే మన గర్వకారణం.

**దుండ్ర కుమారస్వామి**
బీ-ఫార్మ్, ఎంఎస్,ఎల్ఎల్‌బీ
జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు
చైర్మన్: బీసీ రిజర్వేషన్ కో. ఆర్డినేషన్ జాక్
హై కోర్టు అడ్వకేట్, 9959912341

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 03.08.2026
www.mudranews.in | @mudranews



**థైరాయిడ్ తగ్గాలంటే**



పాలల్లో పసుపు కలుపుకొని తాగాలి. పసుపులోని కర్కుమిన్ శరీరంలో వాపును తగ్గించడంలో ఉపయోగపడుతుంది. రోగ నిరోధక శక్తికి కూడా మేలు చేస్తుంది.

# 'నషా ముక్త్ యువ భారత్'కు యువత ప్రతిజ్ఞ

**హైదరాబాద్‌లో మేరా యువ భారత్-బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**
**ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**

**ముద్ర, హైదరాబాద్ :** కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువ భారత్, బ్రహ్మకుమారీస్ సహకారంతో ఆదివారం హైదరాబాద్‌లో "నషా ముక్త్ యువ భారత్ సంకల్ప్ అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో సుమారు 1,500 మంది యువత, పౌరులు పాల్గొని మాదకద్రవ్య రహిత భారత నిర్మాణానికి ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్రహ్మకుమారీస్ డైరెక్టర్ బీకే కులదీప్ దీదీ, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానా కిషోర్ (ఐఏఎస్), డీపీఎస్ చైర్మన్ ఎం. కొమరయ్య, భారత నౌకాదళం కెప్టెన్ శివా సింగ్, మేరా యువ భారత్



తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ (ఇన్‌చార్జ్) చి. అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.మేరా యువ భారత్ రాష్ట్ర డైరెక్టర్ చి. అన్వేష్ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు.తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. యువత 'నషా ముక్త్ భారత్' ఉద్యమానికి రాయబారులుగా మారి సమాజాన్ని మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాలని, ఆరోగ్యవంతమైన భారత నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ సందేశాన్ని ప్రసారం చేశారు. అనంతరం పాల్గొన్న వారంతా నషా ముక్త్ యువ భారత్ ప్రతిజ్ఞ చేసి, మాదకద్రవ్య రహిత భారత నిర్మాణానికి తమ అంకితభావాన్ని పునరుద్ఘాటించారు.మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతలో అవగాహన పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం, అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు.

# హిందూ సమాజం సంఘటితంగా ఉండాలి

**గడప వరకే కులం గడప దాటితే హిందువులం**
**రాష్ట్ర సాదు పరిషత్ అధ్యక్షులు శంకర్ స్వామీజీ**

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** కులమతాలను పక్కనపెట్టి హిందూ సమాజమంతా కలసి కట్టుగా నడుం బిగించాలని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షులు శంకర్ స్వామీజీ పేర్కొన్నారు. తాండూర్ నియోజకవర్గం పెద్దేముల్ మండల కేంద్రంలోనీ ఆంజనేయస్వామి దేవాలయంలో 76 వ వారం సామూహిక శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్ననాటి నుండే దైవభక్తి, దేశభక్తి పట్ల అవగాహన కల్పించాలని, అదేవిధంగా రామాయణం, మహాభారతం లోని సారాంశాన్ని పిల్లలకు తెలియజేయాలని, మరియు హిందూ సామ్రాజ్యం కోసం పోరాటాలు చేసిన మహా వీరుల గురించి చత్రపతి శివాజీ మహారాజ్, సర్దార్ వల్లభాయ్ పటేల్, భగత్ సింగ్, స్వామి వివేకానంద తదితర మహానుభావుల చరిత్రల గురించి వివరించాలని తద్వారా పిల్లలలో దేశం పట్ల భక్తి భావం నాటుక



పోతుందని స్వామీజీ తెలియజేశారు. కార్యక్రమంలో హిందూ వాహిని కార్యకర్తలు, విశ్వహిందూ పరిషత్ నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురవాలి

**మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

**ముద్ర, హైదరాబాద్ :** రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలనీ మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికగా, వేదమంత్రాల మధ్య ఆశీర్వచనాలు అందించి ప్రసాదాలు సమర్పించారు. అనంతరం ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో ఓం జెండాను ఆవిష్కరించిన తలసాని, బోనాల జాతర సందర్భంగా నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. క్యూ లైన్‌లో ఉన్న భక్తులకు వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల ఉత్సవాలు నిలుస్తాయని



పేర్కొన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని డిమాండ్ ఉన్నప్పటికీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం బోనాలను అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించి ఘనంగా నిర్వహించిందని గుర్తు చేశారు. మహంకాళి అమ్మవారికి తెలంగాణ ప్రభుత్వం బంగారు బోనం సమర్పించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు.లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నెల రోజుల ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 200 సంవత్సరాల చరిత్ర కలిగిన మహంకాళి అమ్మవారి ఆలయానికి సేవలందిస్తున్న డెక్కన్ మానవ సేవా సమితి శతాబ్ది సంవత్సరాన్ని



పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు సేవలందించిన ప్రభుత్వ శాఖలు, డెక్కన్ మానవ సేవా సమితి, ఆర్యసమాజ్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు.

**ప్రముఖులకు శతాబ్ది మెమెంటోలు**

డెక్కన్ మానవ సేవా సమితి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రూపొందించిన ప్రత్యేక మెమెంటోలను బోనాల జాతరకు విచ్చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తదితర ప్రముఖులకు తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేసి శాలువాలతో సత్కరించారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**దేశ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది**
**ఎంపీ ఈటల రాజేందర్**

**ముద్ర, మేడ్చల్, మల్కాజిగిరి:** పాకిస్తాన్ నుంచి అక్రమంగా స్మగ్లింగ్ అవుతున్న డ్రగ్స్ యువతతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థను కూడా దెబ్బతీస్తున్నాయని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు.నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో నిర్వహించిన "నశా ముక్త్ యువ" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.భారత్ యువశక్తి కలిగిన దేశమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ వేదికలపై గర్వంగా చెబుతున్నారని, ఆ యువశక్తి ఆరోగ్యవంతంగా, దేశభక్తితో, నిబద్ధతతో ముందుకు సాగితేనే దేశం ప్రపంచ అగ్రస్థానానికి చేరుకుంటుందని అన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు ప్రతి ఏడాది ప్రధాని మోదీ మార్గదర్శనం చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ మహమ్మారి యువత, కుటుంబాలు, సమాజాన్ని నాశనం చేస్తోందని, పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలు కూడా డ్రగ్స్ ప్రభావంతో తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. పాకిస్తాన్ నుంచి జరుగుతున్న డ్రగ్స్ స్మగ్లింగ్ దేశానికి పెద్ద ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.ఒకప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉన్న భారత్ నేడు ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించే దిశగా పయనిస్తోందన్నారు. రైల్వేలు, ఎయిమ్స్, ఐఐటీలు, విమానాశ్రయాలు వంటి ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల నిర్మాణంలో దేశం వేగంగా అభివృద్ధి సాధిస్తోందని చెప్పారు.డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించిన ఈటల, సంకల్పం, కృషి ఉంటే ఎవరైనా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. చిన్న పాఠశాల, పెద్ద పాఠశాల అనే తేడా లేదని, లక్ష్యం ఉంటే విజయాన్ని సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు.సెల్‌ఫోన్, టాబ్లెట్, టెలివిజన్ వంటి సాంకేతిక సాధనాలను మంచి కోసం మాత్రమే ఉపయోగించాలని, వాటి దుర్వినియోగం జీవితాన్ని నాశనం చేస్తుందని హెచ్చరించారు. హంస పాలు, నీటిని వేరు చేసినట్లే, విద్యార్థులు కూడా మంచి–చెడులను గుర్తించే వివేకాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా చదువుతో పాటు మంచి విలువలను అలవరచుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల



యాజమాన్యం పాల్గొన్నారు.

## బోనాల సందర్భంగా మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని ఆదివారం ఎంపీ ఈటల రాజేందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆలయ చరిత్రను ప్రస్తావిస్తూ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉజ్జయిని మహంకాళి ఆలయానికి సుమారు 210 ఏళ్ల చరిత్ర ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో కలరా వ్యాధి విజృంభించి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న సమయంలో, ఉజ్జయినిలో ఆర్మీలో పనిచేసిన సూరటి



అప్పయ్య ముదిరాజ్ అమ్మవారి విగ్రహాన్ని తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారని, అప్పటి నుంచి వారి వంశస్థులే ఆలయ సంప్రదాయాలను కొనసాగిస్తున్నారని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల ఉత్సవాలు నిలిచాయని పేర్కొన్న ఆయన, గోల్కొండ బోనాలతో ప్రారంభమై ఉజ్జయిని మహంకాళి బోనాలు, అనంతరం ఓల్డ్ సిటీ బోనాలతో ముగిసే ఈ ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారన్నారు. అలాగే వీఐపీ దర్శనాల కారణంగా సాధారణ భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకూడదన్నారు.ముఖ్యంగా బోనం ఎత్తుకుని వచ్చే మహిళలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, ప్రజాప్రతినిధులు, వీఐపీలు భక్తులకు అసౌకర్యం కలగకుండా సాధారణ సమయాలకు భిన్నంగా లేదా రద్దీ లేని సమయంలో దర్శనం చేసుకోవాలని సూచించారు.

## బోనాల పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన బండి రమేశ్



**ముద్ర, కూకట్‌పల్లి:** ఆషాఢ మాస బోనాల మహోత్సవాల సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేటలో ఉన్న శ్రీ మైసమ్మ తల్లి దేవాలయం, శ్రీ ఉప్పలమ్మ తల్లి దేవాలయం, శ్రీ బీరప్ప స్వామి ఆలయాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన అమ్మవార్లను దర్శించుకుని రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఈ వేడుకలను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం



**ముద్ర, కూకట్‌పల్లి :** అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆదివారం తమ చిన్ననాటి స్నేహితులను ఆప్యాయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ స్నేహితులతో ఎంతో ఆత్మీయంగా, ఆనందంగా సమయం గడిపారు .జీవితంలో ఎన్ని మార్పులు వచ్చినా నిజమైన స్నేహం కాలంతో పాటు మరింత బలపడుతుందని "స్నేహమేరా జీవితం – స్నేహమేరా శాశ్వతం" అంటూ రాజేశ్వరరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. పాత అనుభవాలను గుర్తుచేసుకుంటూ నవ్వులు పంచుకున్న ఆ క్షణాలు జీవితాంతం గుర్తుండిపోతాయని ఆయన అన్నారు.కష్ట సుఖాల్లో తోడుగా నిలిచే నిజమైన స్నేహితులే జీవితంలో అత్యంత అమూల్యమైన ఆస్తి అని కొనియాడారు. ఈ సమావేశంలో రాజేశ్వరరావు చిన్ననాటి మిత్రులు, ఆత్మీయులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**ముద్ర, శేరిలింగంపల్లి :** వైశాలి నగర్ సమీపంలోని రైల్వే అండర్‌పాస్ వద్ద ఇటీవల నాలాలో గల్లంతైన కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ బీ బ్లాకు కాలనీకి చెందిన బాలయ్య (70) కుటుంబాన్ని పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్తో కలసి అధికారులు, ప్రజాప్రతినిధులు పరామర్శించారు. జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి పలువురు అధికారులు కలిసి బాధిత కుటుంబాన్ని వారి నివాసంలో పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబానికి రూ.2,00,000 (రెండు లక్షల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని, అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ ఆర్థిక సహాయానికి మరియు బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు స్థానికులు తెలిపారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**ఆగస్టు 10లోగా ఎన్యుమరేషన్ ఫారాలు బీఎల్ఓలకు అందజేయాలని పిలుపు**

**ముద్ర, హైదరాబాద్:** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ్ నగర్‌లో జరుగుతున్న ఎన్యుమరేషన్ ప్రక్రియను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణలో భాగంగా ప్రతి ఓటరు ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తి వివరాలతో నింపి, సంతకం చేసి ఆగస్టు 10లోగా తప్పనిసరిగా బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ)కు అందజేయాలని కోరారు. ఫారం సమర్పించకుండా కేవలం ఇంట్లో ఉంచుకుంటే ఓటరు నమోదుకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు.ఓటరు జాబితా సవరణ పనులను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య బాధ్యత అని పేర్కొన్న ఆయన, ఓటు హక్కు కోల్పోతే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవల విషయంలో కూడా ఓటరు నమోదు ప్రాధాన్యం పెరుగుతోందని తెలిపారు.ఎన్యుమరేషన్ ప్రక్రియలో బీఎల్ఓలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రస్తావిస్తూ, హైరైజ్ భవనాలు, గేటెడ్ కమ్యూనిటీల్లో ప్రవేశానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, కాలనీ అసోసియేషన్లు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ముసాయిదా ఓటరు జాబితా విడుదల తర్వాత అవసరమైతే మాత్రమే ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు పత్రాలను సమర్పించాలని తెలిపారు. ఫారం సమర్పించిన తర్వాత తప్పనిసరిగా బీఎల్ఓ నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ (రసీదు) తీసుకుని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 03.08.2026
www.mudranews.in | @mudranews



## థైరాయిడ్ తగ్గాలంటే

థైరాయిడ్ తగ్గాలంటే తులసి-దాల్చిన చెక్క కషాయం వాడాలి. ఈ హెర్బల్ డ్రింక్ మెటాబాలిజాన్ని మెరుగుపరచడంలో, శరీరాన్ని చురుకుగా ఉంచడంలో సహాయపడవచ్చు.



# కరీంనగర్ అభివృద్ధే లక్ష్యం..

- కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొస్తాం
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- మేయర్, డిప్యూటీ మేయర్ తో కలిసి కరీంనగర్ 24వ
- డివిజన్ లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ముద్ర, కరీంనగర్** : కరీంనగర్ నగరాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే తన ప్రధాన లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. నగర అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ఆదివారం కరీంనగర్ నగరంలోని 24వ డివిజన్ బ్యాంక్ కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో యూఐడీఎఫ్ నిధుల ద్వారా చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణరెడ్డితో కలిసి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు.

అనంతరం కిసాన్‌నగర్‌లోని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో బోనాల పండుగ విశిష్టతను వివరించారు.

బోనాలు కేవలం ఒక జాతర మాత్రమే కాదని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి, శక్తి, జానపద కళల సమ్మేళనమని పేర్కొన్నారు. లక్షలాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఈ ఉత్సవాలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తాయని అన్నారు. మహిళా శక్తికి, కుటుంబ బంధాలకు, గ్రామీణ–పట్టణ సంప్రదాయాల పరిరక్షణకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు.

"బోనం అనేది కుండలో వండిన అన్నం మాత్రమే కాదు.. తల్లిపై బిడ్డకు ఉన్న అపారమైన ప్రేమకు ప్రతీక. పోతురాజు నృత్యం కేవలం వినోదం కాదు.. మన ఊరిని, సమాజాన్ని కాపాడే వీరత్వానికి చిహ్నం. ఇంత గొప్ప విశిష్టత కలిగిన బోనాల ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి" అని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

## నిర్మల్ లో ఆషాఢ బోనాల సంబురాలు

పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి కవిత



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లా కేంద్రంలోని నంది గుండం శ్రీ దుర్గామాత ఆలయంలో బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సతీమణి ఏలేటి కవిత రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంగల్ పేట్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, కౌన్సిలర్లు గంజి రాజు, శ్రీరామోజు నరేష్, శశాంక్, సూరజ్ నాయక్, బి జె వై ఎం జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, బీజేపీ నాయకులు జుట్టు దినేష్, వెంకటేష్, కందుల హరీష్, భరత్, శ్రీకాంత్ రెడ్డి, విజయ్, దీక్షిత్ రెడ్డి, ఈర్ల చరణ్, ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడు

-బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ....



**ముద్ర, కోరుట్ల;** నిత్యం మనకు సాక్షాత్కరించే ప్రత్యక్ష దైవమే సూర్య భగవానుడని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు, పురాణ ప్రవర బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ పేర్కొన్నారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా శ్రీ బ్రహ్మ మహాపురాణ ప్రవచన సప్తాహం 2వ రోజు కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహేశ్వరశర్మ ప్రవచనం చేస్తూ ప్రతిరోజు సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు మనకు కాంతిని ప్రసాదించి కాపాడే సూర్య భగవానుడు ప్రత్యక్ష దైవమన్నారు. ఆ సూర్య భగవానుని పవిత్ర క్షేత్రం కోణార్కలో ఉందని, అక్కడ స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం అన్నారు. సంవత్సరమంతా రకరకాల కిరణాలతో మనకు వెలుగుల నిచ్చే సూర్యుణ్ణి ద్వాదశ సూర్యులుగా సనాతన ధర్మం అభివర్ణించిందన్నారు. మొదట సనాతన ధర్మ ప్రచార సమితి అధ్యక్షులు మంచాల జగన్, అయ్యప్ప దేవాలయ వ్యవస్థాపకులు చిదురాల నారాయణ గురుస్వామి దంపతులు గురు వందనం చేశారు. కార్యక్రమంలో సనాతన ధర్మ ప్రచార సమితి ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారామ్, పురాణ కమిటీ చైర్మన్ & పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పడిగెల శ్రీనివాస్, నిర్వాహకులు మంచాల రాజలింగం, అల్లాడి ప్రవీణ్, దొంతుల సుందర వరద రాజన్, గంప శివ కుమార్, ఎలగందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్లపై అపోహలు వద్దు.. సమాన గౌరవం ఇవ్వాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




**ముద్ర, హైదరాబాద్** : హైదరాబాద్‌లో నిర్వహించిన "LGBT – A Legal Battle" డాక్యుమెంటరీ 50 రోజుల విజయోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల పట్ల సమాజంలో ఉన్న అపోహలను తొలగించి, వారి కష్టాలను అర్థం చేసుకుని సమాన గౌరవం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ట్రాన్స్‌జెండర్ల జీవితా ల్లో ఎదురయ్యే వివక్ష, అవమానాలను హృద్యంగా చూపించిన దర్శకుడు సునీల్ రెడ్డిని మంత్రి అభినందించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు, వైద్య సహాయం, 2BHK గృహాలు, విద్య, ఉపాధి అవకాశాల ద్వారా వారికి అండగా నిలుస్తోందన్నారు.ఈ డాక్యుమెంటరీ ప్రతి కుటుంబం, పాఠశాల, కళాశాలకు చేరి ట్రాన్స్‌జెండర్ సమాజం పట్ల అవగాహన, మానవత్వం పెంపొందించాలని మంత్రి ఆకాంక్షించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రవికుమార్




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** తెలంగాణ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల భైంసా కి చెందిన డాక్టర్ రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు, నిర్మల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రఘునాథ్, కట్ట రమేష్ రెడ్డి లు తెలియజేశారు. ఈ సందర్భంగా రవి కుమార్ ను అధ్యాపకులు సూర్య సాగర్, శంకర్, మురళి, సుభాష్ తదితరులు అభినందించారు..

## హరిహర క్షేత్రంలో భారీగా నగల దోపిడీ

- పది కేజీల వెండి, మూడున్నర గ్రాముల నగల చోరీ
- చోరీ సొత్తు విలువ రూ.20 లక్షల పైనే
- ఆగని వరుస దొంగతనాలు
- భయాందోళనల్లో ప్రజలు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ లో దొంగతనాలు దోపిడీల పరంపర కొనసాగుతూనే ఉంది తాజాగా శనివారం అర్ధరాత్రి పట్టణంలోని హరిహర క్షేత్రం లో దోపిడి జరిగింది. ఈ దోపిడీలో మూడు దేవాలయాల్లో దేవతా మూర్తులకు అలంకరించిన నగలన్నీ దోపిడీకి గురయ్యాయి. వివరాలు లో ఉన్నాయి. నిర్మల పట్టణంలోని హరిహర క్షేత్రంలో అయ్యప్ప స్వామి దేవాలయం తో పాటు పలు దేవాలయాలు ఉన్నాయి. ఈ ప్రాంగణంలో శనివారం అర్ధరాత్రి దొంగలు స్వైర విహారం చేసి దోచుకెళ్లారు.

అమ్మవారి దేవాలయం, సుబ్రమణ్య స్వామి దేవాలయం, వినాయక దేవాలయాల్లో దేవతా మూర్తులకు అలంకరించిన వెండి బంగారు నగలను దోచుకెళ్లారు ఈ దోపిడీలో అమ్మవారి మెడలోని పది గ్రాముల మంగళసూత్రం, పది గ్రాముల బంగారు ముక్కుపుడక, మూడు గ్రాముల బంగారు బొట్టు బిళ్ళ, పది తులాల వెండి కిరీటం, ప్రధాన విగ్రహం కోసం ఏర్పాటుచేసిన 2 కిలోల వెండి కిరీటం, 10 తులాల వెండి కాసులపేరు దోపిడికి గురయ్యాయి. అలాగే గణపతి దేవాలయంలో అర కిలో వెండి కిరీటం దోచుకున్నారు. సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో అరకిలో వెండి కిరీటం, 3.500 కిలోల మకర తోరణం, 3 కిలోల నాగఫణి, పుట్ట చోరీకి గురయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం దోపిడి సొత్తు విలువ రూ.25 లక్షల మేర ఉంటుందని భావిస్తున్నారు. దొంగలు గుడి ఆవరణలోకి రాగానే అక్కడ కాపలా ఉండేవారి నివాసాలకు బయటనుండి గొళ్ళెం పెట్టి దోపిడి చేసారు. ఉదయం ఎప్పటిలాగే పూజారులు గుడికి పూజల నిమిత్తం రాగానే గుడుల తలుపులు తెరిచి ఉండటం గమనించి దేవాలయ నిర్వహణ కమిటీ కి సమాచారం అందించారు. కమిటీ ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ ఆధ్వర్యంలో ఆధారాలను సేకరించారు. డి ఎస్పీ శ్రీనివాస్ కేసు దర్యాప్తు ప్రారంభించారు.

## ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ ఆధ్వర్యంలో జువ్వాడి నర్సింగ్ రావు కు ఘన సన్మానం



**ముద్ర, కోరుట్ల;** తెలంగాణ రాష్ట్ర తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జువ్వాడి నర్సింగ్ రావు ని ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోజు హైదరాబాద్‌లో ఘన సన్మానం చేసారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, వెలమ సమాజ అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెలమ కార్పొరేషన్‌కు తొలి చైర్మన్‌గా జువ్వాడి నర్సింగ్ రావు నియమితులు కావడం సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో వెలమ కార్పొరేషన్ ద్వారా సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలై, సమాజ అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం జువ్వాడి నర్సింగ్ రావు ను అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు, వెలమ సంఘ ప్రతినిధులు, ప్రముఖులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా పోచమ్మ బోనాలు...



**ముద్ర చిగురుమామిడి:** చిగురుమామిడి మండలంలోని అన్ని గ్రామాల్లో పోచమ్మ బోనాలు వైభవంగా సాగాయి.. మండలంలోని నవాబుపేట్ గ్రామంలో గ్రామదేవతలు పోచమ్మ ,మహంకాళమ్మ లకు గ్రామం అంతా ఊరు వాడ ప్రతీ ఇల్లు బోనాలు చేసి డప్పు చప్పుల మధ్య ఊరేగింపుగా కలిసి వెళ్ళి గ్రామదేవతలకు మొక్కులు సమర్పించుకున్నారు. వ్యవసాయం బాగుండాలని అందుకు వర్షాలు సమృద్ధిగా కురవాలని అందరూ సుభిక్షంగా ఆయురారోగ్యాలతో ఉండాలని దేవతలను కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుళ్ళ రజితా రాజు, ఉపసర్పంచ్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి ,పాలకవర్గం, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వార్డు మెంబర్ బోయినీ వేణు, బీ జే పి.గ్రామశాఖ అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, బీ ఆర్ ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పిల్లి వేణు , అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బోయిని విజయ్, బీ, ఎస్,పీ కరీంనగర్ పార్లమెంటు ఇంచార్జి బోయినీ బాబు , మహిళలు,ప్రజలు పాల్గొన్నారు.



మండలంలోని గునుకులపల్లె గ్రామంలో పోచమ్మ బోనాల ఉత్సవాలను ఆదివారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గునుకుల మధుసూదన్ రెడ్డి,మాజీసర్పంచ్ గునుకుల అమూల్య రెడ్డి అమ్మవారికి పసుపు కుంకుమలతో పట్టు వస్త్రలను సమర్పిం చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి,ఉత్సవ కమిటీ సభ్యులు గునుకుల రాజిరెడ్డి,కరివేద రవీందర్ రెడ్డి,గునుకుల రవీందర్ రెడ్డి,వెన్నం రాజిరెడ్డి,ఉప్పుల శ్రీని వాస్ రెడ్డి,కరివేద జగ్గారెడ్డి,కరివేద మల్లారెడ్డి,కాంతల ప్రవీణ్ రెడ్డి,ఒంటెల వెంకట్ రెడ్డి,సన్నిళ్ల మల్లేశం,బత్తిని నారాయణ,కమలాకర్ రెడ్డి ,లక్ష్మారెడ్డి,కాంతల రాంరెడ్డి పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ మృత దేహం లభ్యం



**ముద్ర, కోరుట్ల;** జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓబులాపూర్ గ్రామ శివారు లోని గోదావరి నదిలో గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైంది. మహిళ వయస్సు సుమారు 25–35 సంవత్సరాల మధ్యలో ఉంది. ఆనవాలుగా మృతదేహం పై నావి బ్లూ రంగు డిజైన్ ఉన్న టాప్, పసుపు రంగు ప్యాంట్, కుడి చేతిపై " అమ్మ "అని కనిపించే టాటూ ఉంది.పై మహిళ గురించి ఎవరికైనా సమాచారం తెలిసి ఉంటే సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా మల్లాపూర్ ఎస్సై ఏ. అనిల్ 8712656796 నంబర్ లో సంప్రదించాలని తెలిపారు.

## 9 నెలల చిన్నారిని నీటిలో ముంచి చంపిన తల్లి

**ముద్ర, హైదరాబాద్**: ఎల్బీనగర్ సమీపంలోని బైరామల్ గూడాలో దారుణం చోటు చేసుకుంది. రాజేశ్వరి అనే మహిళ తన 9 నెలల కుమార్తె అనురాధను చెరువులో ముంచి చంపేసింది. మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 03.08.2026
www.mudranews.in | @mudranews



### థైరాయిడ్ తగ్గాలంటే

సమతుల ఆహారం అయోడిన్, సెలీనియం, జింక్, ఐరన్ వంటి పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం థైరాయిడ్ ఆరోగ్యానికి కీలకం.



## ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై

# రాకపోకలకు గ్రీన్ సిగ్నల్

**దేవరపల్లి రహదారిపై ప్రయాణించిన మంత్రి తుమ్మల**
**రూ.3,573 కోట్లతో నిర్మాణం పూర్తి**
**ప్రయాణ సమయం సగానికి తగ్గింపు**
**2017 నుంచి నిరంతర పర్యవేక్షణ**
**నితిన్ గడ్కరీ అనుమతితో సాకారమైన ప్రాజెక్టు**
**హైదరాబాద్ నుంచి ఉత్తరాంధ్ర, పశ్చిమ బెంగాల్‌కు నేరుగా అనుసంధానం**
**ఆరు గంటల నుంచి రెండున్నర గంటల్లో**
**రైతులు స్థానికులకు ఉపాధి రవాణా వరం**
**ఫలించిన మంత్రి తుమ్మల కృషి**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** తెలుగు రాష్ట్రాల ప్రజలు దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైటెక్ హైవేపై రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదంతో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా దేవరపల్లి రహదారిపై ప్రయాణించి పరిస్తితిని పరిశీలించారు. తెలంగాణ తొలి రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి తుమ్మల చిరకాల స్వప్నం ఎట్టకేలకు నెరవేరింది. మంత్రి తుమ్మల ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 1న అధికారులు రాకపోకలకు అనుమతించారు. అనధికారికంగా ప్రజల రాకపోకలు కొనసాగడంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా ఈ రహదారిపై ప్రయాణించడం విశేషం.తుమ్మల కృషి ఫలితం: 2017 నుంచి నిరంతర పర్యవేక్షణకేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు అనుమతి మంజూరు చేయగా, అప్పటి కేంద్ర రహదారుల కార్యదర్శి గిరిధర్ (ఐఏఎస్) సహకారంతో 2017లోనే డీపీఆర్ సిద్ధం చేయించి, 2018 నాటికే భూసేకరణ పూర్తి చేయించడం ద్వారా మంత్రి తుమ్మల ఈ ప్రాజెక్టుకు వేగం అందించారు. టెండర్ల దశ నుంచి పనుల పూర్తి వరకూ నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, ధ్వంసలాపురం, కల్లూరు, వేంసూర్ వంటి కీలక ప్రాంతాల్లో కొత్త ఎగ్జిట్ పాయింట్ల మంజూరుపై ప్రత్యేకంగా కృషి చేసి సాధించారు. దీనిపై స్థానికులు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.రూ.3,573 కోట్లతో నిర్మాణం – 165 కి.మీ. పొడవుభారత్‌మాల ఎకనామిక్ కారిడార్ పథకం కింద నిర్మించిన ఈ రహదారి తెలంగాణలోని ఖమ్మం జిల్లా తల్లంపాడు వద్ద ప్రారంభమై, ఏపీలోని రాజమండ్రి సమీపంలోని దేవరపల్లి వద్ద (జాతీయ రహదారి–16పై) ముగుస్తుంది. మొత్తం 165 కిలోమీటర్ల పొడవులో – తెలంగాణలో 90 కి.మీ., ఏపీలో 75 కి.మీ. మేర ఈ రహదారి విస్తరించి ఉంది.ఈ మార్గం అందుబాటులోకి రావడంతో హైదరాబాద్–రాజమండ్రి–విశాఖపట్నం మధ్య ప్రయాణికులు విజయవాడ మీదుగా వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. తద్వారా సుమారు 56 కిలోమీటర్ల దూరం, సూర్యాపేట నుంచి చూస్తే దాదాపు 100 కిలోమీటర్ల దూరం ఆదా అవుతుంది. గతంలో సూర్యాపేట నుంచి విజయవాడ మీదుగా రాజమండ్రి చేరుకోవాలంటే 4–6 గంటలు పట్టేది కాగా, కొత్త హైవేతో కేవలం రెండున్నర గంటల్లోనే గమ్యం చేరుకోవచ్చు. ఈ కారిడార్ ద్వారా ఏపీలోని ఏడు జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర, పశ్చిమ బెంగాల్, కలకత్తా వరకూ నేరుగా అనుసంధానం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.తెలుగు రాష్ట్రాల్లోనే తొలి యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవేఈ రహదారి తెలుగు రాష్ట్రాల్లోనే తొలి యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవేగా ప్రత్యేకత సంతరించుకుంది. నిర్ణీత ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద మాత్రమే ప్రవేశం కల్పిస్తూ, ప్రతి 18 కిలోమీటర్లకు ఒక ఎంట్రీ/ఎగ్జిట్ పాయింట్ ఏర్పాటు చేశారు. ప్రయాణించిన దూరాన్ని బట్టి టోల్ వసూలు చేసే 'క్లోజ్డ్ టోలింగ్ సిస్టం'ను అందుబాటులోకి తెచ్చారు.భద్రత కోణంలో ఐదు చోట్ల అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఏటీఎంఎస్), ప్రతి 2 కిలోమీటర్లకు 360 డిగ్రీల సీసీ కెమెరాలు,



సోలార్ దీపాలు, ప్రతి 5 కిలోమీటర్లకు ఎమర్జెన్సీ ఓపెనింగ్‌లు ఏర్పాటు చేశారు. అతివేగం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలను ఏఐ కెమెరాలు గుర్తించి నేరుగా చలాన్లు జారీ చేస్తాయి. ప్రతి 50 కిలోమీటర్లకు 5 ఎకరాల విస్తీర్ణంలో హోటళ్లు, పెట్రోల్ బంకులు, వాష్‌రూమ్‌ల వంటి సదుపాయాలు కల్పించారు. క్యూఆర్ కోడ్ ద్వారా సమీప పోలీస్ స్టేషన్, పెట్రోల్ బంక్ వివరాలు తెలుసుకునే వెసులుబాటు కూడా ఉంది. గరిష్ఠంగా గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వీలుంది.రైతులకు, స్థానికులకు వరంపచ్చని పంట పొలాల మధ్య నుంచి సాగే ఈ రహదారి ప్రయాణికులకే కాక రైతులు, స్థానికులకు కూడా ఎంతో ఉపయోగపడనుంది. ఈ ప్రాజెక్టు వెంబడి ఉన్న ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సౌలభ్యం, అనుబంధ పరిశ్రమల అభివృద్ధి చెందుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2017లో ప్రతిపాదన రూపొందిన ఈ ప్రాజెక్టు అన్ని అడ్డంకులను అధిగమించి నేడు పూర్తిస్థాయిలో సాకారమైంది. ఈ హైవే అందుబాటులోకి రావడంతో ప్రయాణ సమయం, వ్యయం ఆదా కావడమే కాక, తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఆర్థిక, రవాణా బంధాలు మరింత బలోపేతం కానున్నాయని అధికారులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు."నా ప్రయత్నాలు ఫలించాయి" – మంత్రి తుమ్మలఈ ప్రాజెక్టు కోసం తాను వేసిన ప్రతి అడుగూ ఫలించిందని, దశాబ్ద కాలంగా పడిన శ్రమ ఈ రోజు కళ్లెదుటే సాకారమైందని మంత్రి తుమ్మల పేర్కొన్నట్లు తెలుస్తోంది. దేవరపల్లి రహదారిపై స్వయంగా ప్రయాణించి పరిస్థితులను పరిశీలించిన ఆయన, తాను మొదలుపెట్టిన ప్రాజెక్టులు ఒక్కొక్కటిగా విజయవంతంగా ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయని, ఇది కేవలం ఒక రహదారి కాదని, తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ మధ్య శాశ్వత అనుబంధానికి వారధి అని వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్ మోసపూరిత వైఖరి వల్లే వేణు ఆత్మహత్యాయత్నం

**బీఆర్ఎస్ నేతల ఆగ్రహం**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** నిరుద్యోగ యువకుడు వేణు ఆత్మహత్యాయత్నానికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే కారణమని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఖమ్మంలోని ప్రశాంతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేణును మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తదితరులు పరామర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఒక్క గ్రూప్ నోటిఫికేషన్ తప్ప మరే ఉద్యోగ ప్రకటన విడుదల చేయకపోవడంతో నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ నెలకొందని విమర్శించారు. వేణు ఆత్మహత్యాయత్నానికి ముందు రాసిన లేఖలో తన బాధను రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లాలని కోరడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.వేణు కుటుంబానికి సొంత ఇల్లు కూడా లేదని, అద్దె ఇంట్లో జీవనం సాగిస్తోందని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించి, వెంటనే ఆ కుటుంబానికి పక్కా ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరూ అధైర్యపడవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని బీఆర్ఎస్ నేతలు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడంలో విఫలమైందని, మరోసారి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.వేణు చికిత్స పొందుతున్న ఆస్పత్రి వద్ద పోలీసుల ఆంక్షలు విధించి కుటుంబ సభ్యులను, పరామర్శకు వచ్చిన నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే వేణుకు అత్యుత్తమ వైద్య చికిత్స అందించి ప్రాణాలు కాపాడడంతో పాటు అతని కుటుంబానికి అన్ని విధాలా సహాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండాల కృష్ణ, ఉప్పల వెంకటరమణ, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, వాచేపల్లి లక్ష్మారెడ్డి, అజ్మీరా వీరునాయక్, బత్తుల మురళి, షేక్ మక్బూల్, జ్యోతిరెడ్డి, సామినేని హరిప్రసాద్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## మట్టి కుండలోంచి 'వాము' పుస్తక ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** డాక్టర్ అట్టెం దత్తయ్య సంపాదకత్వంలో, ధ్రువ ఫౌండేషన్ అందిస్తున్న "తెలంగాణ బీసీ కథలు" శ్రేణిలో రెండవ గ్రంథంగా వెలువడిన "వాము (కుమ్మరుల బతుకు చిత్రాలు)" పుస్తకాన్ని ఆదివారం భువనగిరిలోని శ్రీ దరిపల్లి అనంత రాములు ఆడిటోరియం, కృషి ఐటిఐ క్యాంపస్‌లో ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. కుమ్మరుల సంప్రదాయ వృత్తికి ప్రతీకగా మట్టి కుండలో దాచిన పుస్తకాన్ని ఆవిష్కర్త ఆచార్య రవిశంకర్, ప్రభుత్వ ఈఎన్‌టీ హాస్పిటల్, కోటి, హైదరాబాద్ ఆవిష్కరించగా ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, రచయిత అన్నవరం దేవేందర్ సభాధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు, సంచాలకులు, ప్రాచ్య పరిశోధనా సంస్థ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి మాట్లాడుతూ, "వృత్తి ఆధారిత సమాజాల చరిత్రను సాహిత్య రూపంలో భద్రపరచడం సమాజానికి ఎంతో అవసరం. 'వాము' వంటి గ్రంథాలు భావితరాలకు చారిత్రక ఆధారాలుగా నిలుస్తాయని అన్నారు.విశిష్ట అతిథి ఆచార్య వై. వెంకటేశ్వర్లు, దరిపల్లి ప్రవీణ్ కుమార్, డాక్టర్ దరిపల్లి కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్, దరిపల్లి అనంత రాములు, ఎదునూరి మల్లేశం, డాక్టర్ వాసరవేణి పరుశురాములు, నాంపల్లి సుజాత, సహ సంపాదకులు ఎం. విప్లవ్ కుమార్, బొల్ల ప్రవీణ్ కుమార్, సీపతి కార్తీక్, ముష్టి నవీన్, సమన్వయకర్త ఎదునూరి వెంకటేష్, మాజీ సర్పంచ్ జోజి, మారుపాక బిక్షపతి, జీవిలికపల్లి వెంకటేష్, ఉపాధ్యక్షులు ములుగు నరసింహ, గుమ్మిడెల్లి రమేష్, కొయ్యాడ లక్ష్మయ్య, కొయ్యాడ అశోక్, పాలబిందెల నర్సయ్య పాల్గొన్నారు.




## ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరం

**మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. ఖమ్మం జిల్లా మంచుకొండలో నిర్వహించిన బీఆర్ఎస్, బీఆర్‌టీయూ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆయన ఆరోపించారు. ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, అధికారంలోకి వచ్చి 30 నెలలు గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు.డీజిల్, పెట్రోల్, సీఎన్‌జీ ధరలు పెరగడం, వాహన విడిభాగాల ధరలు, నిర్వహణ ఖర్చులు, ఫైనాన్స్ ఈఎంఐలు, కుటుంబ పోషణ భారం కారణంగా ఆటో డ్రైవర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం వారికి అండగా నిలవాల్సిందిపోయి పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు.కాంగ్రెస్ పాలనలో అనేక మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమని, ఈ పరిస్థితికి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని పువ్వాడ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఆటో కార్మికుల సంక్షేమానికి శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు.కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేసిందని ఆయన గుర్తు చేశారు. ప్రమాద బీమా పథకం ద్వారా ప్రమాదవశాత్తు మరణించిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా అందించి ఆర్థిక భరోసా కల్పించిందని, కార్మిక వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.



## భువనగిరిలో 22న పెద్దమ్మ బోనాలు.. 23న గ్రామ దేవతల బోనాలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**భువనగిరి పట్టణంలోని మున్సిపల్ పరిధిలో ఆగస్టు 22 శనివారం శ్రీ పెద్దమ్మ తల్లికి 23 ఆదివారం ఆయా వార్డులలో ఉన్న గ్రామదేవతలకు బోనాలు సమర్పించాలని పట్టణంలోని ముదిరాజ్ పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం కిసాన్ నగర్ లోని పెద్దమ్మ దేవాలయంలో ముదిరాజ్ బోనాల ఉత్సవ కమిటీ సమావేశం నాయకులు పెంట నరసింహ, ఇట్టబోయిన గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ పెద్దమ్మతల్లి బోనాలు ఆయా వార్డుల నుండి డప్పు చప్పులతో ప్రదర్శన నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ పెద్దలు సాధు విజయకుమార్, కుక్క దూవ్వ సోమయ్య, కొలుపుల వివేకానంద, తుపాకుల శ్రీను, జంగిటి రవి, గుర్రాల శివనాగేందర్, ఉడుత భాస్కర్, తుమ్మల నాగేష్, ఎనబోయిన జహంగీర్, కనక బాలరాజు, బండి జంగయ్య, వెంట్రుక భాస్కర్ పాల్గొన్నారు.

## స్నేహితుడి సలామతి కోసం దువా



**ముద్ర, దేవరకొండ:** ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా దేవరకొండలో స్నేహబంధానికి ప్రతీకగా హృదయాన్ని హత్తుకునే కార్యక్రమం నిర్వహించారు. ప్రాణ స్నేహితులు తమ ఆత్మీయ మిత్రుడు అబ్దుల్ ఖాదర్ (బాబా భాయ్)ను 'సెహత్ కే ఫూల్' ఘనంగా సన్మానించి, ఆయన ఆరోగ్యం, సలామతి, ఆనందం, దీర్ఘాయుష్షు కోసం ప్రత్యేకంగా దువా చేశారు.ఈ సందర్భంగా స్నేహితులు అబ్దుల్ ఖాదర్‌కు శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం స్నేహితులతో పాటు వారి కుటుంబ సభ్యులు కలిసి ఆయన మంచి ఆరోగ్యం, క్షేమం, భద్రత, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు. ఆప్యాయత, అనురాగాలతో సాగిన ఈ కార్యక్రమంలో స్నేహితులందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీద్ మౌలానా, శంషోద్దీన్, ఖాదర్ పాషా, అహ్మద్, ముస్తఫా, షకీల్, రజాక్, థౌఫీక్, ఆబిద్, అబ్దుల్ రహీం, జలీల్, ముజఫ్ఫర్, జునైద్ లాల్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా బూరుగు శివశంకర్



**ముద్ర, దేవరకొండ:** మల్లేపల్లి పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం శ్రీచక్ర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు ఆలంపల్లి నరసింహ, ఆర్యవైశ్య మహాసభ జిల్లా మాజీ అధ్యక్షుడు పానుగంటి మల్లయ్య సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా బూరుగు శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా సముద్రాల అజయ్ కుమార్, కోశాధికారిగా కామిశెట్టి వంశీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ 2026–2028 కాలానికి రెండేళ్లపాటు బాధ్యతలు నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బూరుగు శివశంకర్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్న ఆర్యవైశ్య సోదరులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధి, యువత ఐక్యత, సామాజిక సేవా కార్యక్రమాల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతి కోసం అందరి సహకారంతో ముందుకు సాగుతామన్నారు.

## అమ్మవారికి ఘనంగా బోనాలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలో శ్రీ ఉప్పలమ్మ పండుగ సందర్భంగా ఆదివారం హెరేకర్ శ్రీను ఆధ్వర్యంలో అమ్మవారికి బోనం సమర్పించి, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజ్, కౌన్సిలర్లు, భక్తులు పాల్గొన్నారు.

## దశదిన కర్మలో పాల్గొన్న బుయ్యని



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి దివంగత రుక్కమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో ఆర్బీఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివంగత శ్రీమతి రుక్కమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యు లకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రషర్ పర్మిషన్ వెనక్కి తీసుకోవాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మండలంలోని తుక్కాపురం గ్రామ నారాగుట్ట సమీపంలో క్రషర్ పర్మిషన్ ని వెనక్కి తీసుకోవాలని జేఏసీ కన్వీనర్ పుట్ట వీరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం జేఏసీ ఆధ్వర్యంలో నారగుట్ట వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాగుట్ట పైన చిదురుగా ఉన్న ప్రదేశాన్ని ప్రభుత్వం కలెక్టర్ నివాస గృహాలకు, గురుకుల స్కూళ్లకు హాస్టల్ ప్రభుత్వ కాలేజీలకు ప్రభుత్వ ఆఫీసులకు అనుగుణంగా ఉన్న భూమిని క్రషర్కు పర్మిషన్లు ఇవ్వడం అనేది ఈ జిల్లాకు ఇక్కడున్న ప్రజలకు మోసం చేసేవారు అవుతారని అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు నారగుట్టని సందర్శించాలని కోరారు. జేఏసీ కోకన్వీనర్ పాక వెంకటేష్ యాదవ్, తుక్కాపూర్ సర్పంచ్ జనగాం పాండు, నమాత్ పెల్లి సర్పంచ్ అతికం అరుణ లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ సర్పంచ్ నోముల మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాసాల మల్లేష్ యాదవ్, కో కన్వీనర్స్ జనగాం, సత్తయ్య, నల్ల మాస కుమార్ గౌడ్, ఆంజనేయులు, పెద్దిటి కొండల్ రెడ్డి, ఉప సర్పంచ్, రసాల లింగస్వామి యాదవ్, ఎలకొండ సుధాకర్ రెడ్డి, జక్కుల ఉప్పలయ్య, మాజీ ఉపసర్పంచ్ ముంత సతీష్ యాదవ్, రత్నపురం సురేందర్, ఉపసర్పంచ్లు, వార్డ్ మెంబర్లు, నాలుగు గ్రామాల అన్ని పార్టీల నాయకులు ప్రజలు రైతులు యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 03.08.2026
www.mudranews.in | @mudranews



### థైరాయిడ్ తగ్గాలంటే

వ్యాయామం & మందులురోజూ 30 నిమిషాల నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయాలి. వైద్యుడు సూచించిన థైరాయిడ్ మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.



## ఫలాంబరిదేవిగా వనదుర్గ



ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత ఫలాంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడమాసం మూడవ ఆదివారం పురస్కరించుకొని అమ్మవారికి తెల్లవారుజామున విశేషంగా పంచామృతాలతో అభిషేకం, మహా అలంకరణ, వివిధ ఫలాలతో అలంకరణ అనంతరం కుంకుమార్చన, మహా మంగళ హారతి ఇచ్చారు. భక్తులు తమ మొక్కులు, ఒడి బియ్యం సమర్పించారు. ఆదివారంతోపాటు ఫ్రెండ్షిప్ డే కావడంతో వేలాదిగా భక్తులు అమ్మవారి దర్శనానికి బారులుతీరారు. - ముద్ర ప్రతినిధి, మెదక్

## నల్ల పోచమ్మకు బోనాలు







మెదక్ పట్టణ ప్రజల ఆరాధ్య దైవం మాత నల్ల పోచమ్మ దేవికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బోనాల ఉత్సవం నిర్వహించారు. ఆషాడ మాసం పురస్కరించుకొని ఆదివారం ముదిరాజ్ సభ్యులు బోనాలు ప్రదర్శనగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాల ఉత్సవం నిర్వహిస్తున్నారు. అర్చకులు శ్రీనివాస్ చారి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. బోనాల ఉత్సవం సందర్భంగా పట్టణాన్ని సుందరంగా అలంకరించారు. హౌసింగ్ బోర్డ్ లో గల నల్ల పోచమ్మ అమ్మవారికి బోనాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. - ముద్ర ప్రతినిధి, మెదక్

# అఖిల వైద్య విద్యకు హరీష్ రావు అభయం

* నాలుగేళ్ల క్రితం తండ్రి చనిపోవడంతో మాజీ మంత్రి హరీష్ రావును ఆశ్రయించిన అఖిల
* 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే దాకా మెరీడియన్ విద్యా సంస్థల్లో చదివించిన ఎమ్మెల్యే



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** సిద్దిపేట పట్టణానికి చెందిన మదూరి రాజు సిదిపేట లో బజరంగ్ అల్లం టి హోటల్ ని కొన్ని ఏళ్లుగా నడిపించాడు.. దురదృష్టావశాత్తు బ్రెయిన్ క్యాన్సర్ తో విధి వక్రీకరించి చనిపోయాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన భార్య, ముగ్గురు ఆడపిల్లలు రోడ్డున పడ్డారు.. తండ్రి నీ కోల్పోయిన పిల్లలు, భర్త ను కోల్పోయిన భార్యకు కుటుంబానికి ఆర్థిక భారంగా మారింది. పిల్లలల్ని ఎలా చదివించాలి అనే ఆందోళన లో తల్లి . కనీసం ఇల్లు కూడా లేని పరిసితి.. అలాంటి సమయంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుని కలసి వారి పరిస్థితి వివరించి సహాయం చేయలని కోరారు అందుకు హరీష్ రావు వారికి డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పించారు. పిల్లల్ని చదివించే బాధ్యత తనదని వారికి భరోసా నిచ్చారు. ప్రస్తుతం పెద్ద కూతరు కావ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సిటు సంపాదించి ఇప్పుడు ఫైనల్ ఇయర్ చదువుతుంది. అప్పటికే రెండవ కూతరు అఖిల మెరిడియన్ స్కూల్ లో చదువుతుంది మంచి ప్రతిభ గల విద్యార్థి, ఆ విద్యార్థి కి సరస్వతి అనుగ్రహం ఉంది కానీ.. లక్ష్మి కటాక్షం లేదు అని ఆందోళన ఉన్న సమయం లో హరీష్ రావు అశ్రయించారు.. స్కూల్ యాజమాన్యం కి ఫోన్ చేసి చెప్పారు.. 9 వ తరగతి నుండి ఇంటర్ పూర్తి అయ్యే వరకు నేనే ఫీజు కడ్త అని వారికి చెప్పారు.ఈ సందర్భంగా మంచి చదివే విద్యార్థి కి సహాయం అందించడం లో స్కూల్ యాజమాన్యం కూడా సహకారం అందించారు... చిన్న కూతరు దీపికను కూడా హరీష్ రావు చదివిస్తా అని భరోసా నిచ్చారు..నీట్ లో మంచి మార్కులు... ఆర్థిక స్తోమత అడ్డు......అఖిల చదువు లో మంచి ప్రతిభ కనభరుస్తూ ఉత్తీర్ణత సాధిస్తూ స్కూల్, లో కాలేజ్ లో ఫస్ట్ ర్యాంక్ లో టాప్ గా నిలుస్తుంది. ఉపాధ్యాయుల ప్రోత్సాహం తో అదే స్ఫూర్తి తో నీట్ పరీక్షలో 720 మార్కులకు 453 మార్కులు సాధించింది.. ఈ మార్కులతో మంచి కళాశాల లో ఎం బి బి ఎస్ సిటు వచ్చే అవకాశం ఉంది.. నీట్ లో మంచి ర్యాంక్ మంచి మార్కులు వచ్చిన సిటు వస్తుంది అనే నమ్మకం ఉన్న కానీ ఆర్థిక స్తోమత అడ్డు వస్తుంది. తండ్రి లేడు తల్లి హోటల్ లో పని చేస్తుంది.. వచ్చిన. అవకాశం ఎలా అని ఆందోళన అఖిల బాధపడుతున్న ఉపాధ్యాయుల సలహాల తీసుకున్నారూ సీటు సాధించు .. నేనే ఫీజు కట్టి చదివిస్తా.....ఇటీవల డాక్టర్ చదువు కోసం నీట్ పరీక్షవ్రాసిన అఖిల నీట్ లో మంచి మార్కులు సాధించింది. అఖిల తండ్రి ని కోల్పోయి ఒక అంత బాధ. తల్లి హోటల్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించడనే కష్టం గా ఉంది అని ఆందోళన చెందుతుంది.. అఖిల కు మంచి మార్కులు వచ్చాయి అని విషయం తెల్సుకున్న హరీష్ రావు విద్యార్థి అఖిలను, తల్లి రేణుక ను తన ఇంటికి పిలిచి అన్నం పెట్టి " అఖిల ఆందోళన వద్దు ఎం. బి. బి. ఎస్ సాధించాలి అనే ని తపన కల నెరవేరుతుంద నీకు సీటు ఎక్కడొచ్చిన నిన్ను మెడిసన్ చదివించే బాధ్యత నాది అని. సిటు సాధించు... ఫీజు నేను చూస్కుంటా అని హరీష్ రావు అభయం ఇచ్చారూ. ఆన్ లైన్ అప్లికేషన్ నుండి సిటు వచ్చి మెడికల్ కళాశాల లో అడ్మిట్ అయ్యేంత వరకు. నువ్ డాక్టర్ అయ్యేంత వరకు పూర్తి బాధ్యత తనదే అని అఖిల కు భరోసానిచ్చారు..

## కేపీహెచ్‌బీ కాలనీ విద్యార్థిని ఘనత

### గీతం వర్సిటీలో ఎం.టెక్ డేటా సైన్స్‌లో ఫస్ట్ ర్యాంక్



**ముద్ర, కూకట్‌పల్లి:** నియోజకవర్గం, కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్ డివిజన్‌కు చెందిన కుమారి అగ్నిమండల రాజరాజేశ్వరి గీతం యూనివర్సిటీలో ఎం.టెక్ (డేటా సైన్స్) విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సాధించి విశిష్ట ప్రతిభ కనబరిచారు.విశాఖపట్నంలో జరిగిన గీతం యూనివర్సిటీ స్నాతకోత్సవంలో విశాఖపట్నం లోక్‌సభ సభ్యులు, గీతం వర్సిటీ ప్రెసిడెంట్ మతుకుమిల్లి భరత్, ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి చేతుల మీదుగా ఆమె గోల్డ్ మెడల్, మెమెంటో మరియు ప్రతిభా సర్టిఫికెట్ అందుకున్నారు.ఈ సందర్భంగా వసంతనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి రాజరాజేశ్వరిని స్వయంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధిస్తే సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని, ఆమె సాధించిన ఈ విజయం కూకట్‌పల్లి నియోజకవర్గానికే గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.అదేవిధంగా, స్వయంకృషితో తన ఇద్దరు పిల్లలను కష్టపడి చదివించి ఉన్నత స్థాయికి తీర్చిదిద్దుతున్న రాజరాజేశ్వరి తల్లి శ్రీమతి అగ్నిమండల విజయలక్ష్మి గారిని సాయిబాబు చౌదరి ప్రత్యేకంగా అభినందించి, వారి సేవలను ప్రశంసించారు.

## చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి

### టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నరేందర్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఉద్యోగ నిర్వహణలో చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్థాయని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ అన్నారు. ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగ విరమణ చేసిన బట్టి రామ్మోహన్ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారన్నారు. మెదక్ సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో కార్యకర్త స్థాయి నుంచి కౌన్సిలర్ గా ఎదిగి క్రియాశీలక కార్యకలాపాలు కొనసాగిస్తున్న క్రమంలో ఉపాధ్యాయ వృత్తి రావడంతో కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసి ఉపాధ్యాయునిగా బాధ్యతలు చేపట్టి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూనే తాను విధులు నిర్వహించే పాఠశాలలలో ఆరోగ్యాన్ని సంరక్షించే మొక్కలను నాటి అహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించిన రామ్మోహన్ అభినందనీయుడని వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రామ్మోహన్ దంపతులను శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, కో ఆప్షన్ సభ్యులు రాగి వనజ, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు, చిన్ననాటి స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండుగ



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** తాండూరు లోని వార్డు నెంబర్ 7 ఎన్టీఆర్ నగర్ లో బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఆడపడుచులు బోనాలు ఎత్తుకొని అమ్మవారికి పూజలు చేసి, నృత్యాలు, డప్పు చప్పుళ్లతో వాతావరణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. .అందరికీ అమ్మ అనుగ్రహం కలగాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు మంచిగా పండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజ్ సీనియర్ నాయకులు బాతుల వెంకటయ్య ఆలయ కమిటీ సభ్యులు ఎన్టీఆర్ కాలనీవాసులు, యువకులు హరిహర టౌన్షిప్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు సత్యనారాయణ రెడ్డిని పరామర్శించిన మైనంపల్లి

### అవసరమైన వైద్య సహాయం అందేలా కృషి చేస్తానని భరోసా



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** కుడికాలు మోకాలి చిప్ప అరిగి పోవడంతో తీవ్ర నొప్పులతో బాధపడుతున్న సీనియర్ జర్నలిస్టు ఎ.సత్యనారాయణ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదివారం పరామర్శించారు. సిద్ధిపేటలో హౌసింగ్ బోర్డు పరిధిలోని జర్నలిస్టుల కాలనీలో ఉన్న సత్యనారాయణ రెడ్డి నివాసానికి వెళ్లిన ఆయన, ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి ఆరోగ్య సమస్యల గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సూచించిన చికిత్స, అవసరమైన వైద్య సేవలపై ఆరా తీశారు. అనారోగ్యంతో మనోధైర్యం కోల్పోవద్దని చెప్పారు. త్వరగా కోలుకునేలా తగిన వైద్య సహాయం అందించేందుకు తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. అవసరమైతే మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కూడా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సమాజానికి సేవ చేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకు వస్తూ నిరంతరం శ్రమించే పాత్రికేయులు అనారోగ్యానికి గురైనప్పుడు వారికి అండగా నిలవడం సామాజిక బాధ్యత అని అన్నారు. సత్యనారాయణ రెడ్డి త్వరగా పూర్తి స్థాయిలో కోలుకుని మళ్లీ తన వృత్తి బాధ్యతల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.సత్యనారాయణ రెడ్డి త్వరగా కోలుకోవాలని అందరూ ఆకాంక్షిస్తూ ఆయనకు తమ సంఘీభావాన్ని తెలియ జేశారు..

## మూడు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయాలి

### సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి ఒక్కరూ మూడు నెలలకోసారి రక్తదానం చేయాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ సూచించారు. రక్తం దానం చేస్తే అనారోగ్యాలకు గురవతామన్న మాట అవాస్తమన్నారు. సిద్దిపేటలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవ పురస్కరించుకొని ప్రెస్ క్లబ్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వా సుపత్రి రక్తనిధి కేంద్రం వారి పర్యవేక్షణలో సుమారు 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాయిరాం మాట్లాడుతూ. అత్యవసర స్థితిలో రక్తదానం చేయడం శుభపరిణామ అన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలకు రక్తం ఎక్కువ శాతం లో అవసరం ఉంటుందని రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానం అన్నారు. సిద్దిపేటలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన కొనియాడారు. ప్రతి ఒక్కరు కూడా ఇలాగే సమాజసేవకు ముందుకు రావాలని ఆకాంక్షించారు. అనంతరం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి గంప శివకుమార్ మాట్లాడారు. తమ అసోసియేషన్ ద్వారా గత మూడు సంవత్సరాలుగా పర్యావరణహిత కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు . ప్లాస్టిక్కు నియంత్రించడం, మట్టి వినాయకుల విగ్రహాల పంపిణీ, రక్తదాన శిబిరం లాంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని కార్యక్రమాలు చేస్తామని వారు వెల్లడించారు.

## సిద్దిపేట టూ వీలర్ ఆటో కన్సల్టెన్సీ యూనియన్ నూతన కార్యవర్గం



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** సిద్దిపేట టూ వీలర్ ఆటో కన్సల్టెన్సీ యూనియన్ (రిజిస్ట్రేషన్ నెం. 4) రెండవ విడత ఎన్నికలు ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. సభ్యుల ఏకగ్రీవ మద్దతుతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిట్ల యాదగిరి, ఉపాధ్యక్షులుగా సయ్యద్ జహీర్, నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా కూరెల్లి జస్వంత్ రెడ్డి, కోశాధికారిగా రామేశ్వర్, సంయుక్త కార్యదర్శిగా కురుమ రవికాంత్ ఎన్నికయ్యారు. అలాగే సలహాదారులుగా కిషన్ రెడ్డి, నరేష్, కృష్ణ, వంగ విజయ్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎన్నికల విజయోత్సవాన్ని అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం (ఫ్రెండ్‌షిప్ డే) వేడుకలతో కలిపి జరుపుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పిట్ల యాదగిరి మాట్లాడుతూ, యూనియన్ సభ్యుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమస్యల పరిష్కారం, సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. సభ్యులందరూ ఐక్యంగా ఉంటే యూనియన్ మరింత బలోపేతమవుతుందని, ప్రతి సభ్యుడి సహకారంతో సంస్థను ఆదర్శవంతమైన సంఘంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, నూతన కార్యవర్గం, సీనియర్ సభ్యులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555